ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 142, పేజీలు - 08

మంగళవారం, నవంబర్ 24, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



తెలంగాణ నీటి హక్కులను కాలరాసింది

కేసీఆర్, హరీష్ రావే

- కృష్ణా జలాల కేటాయింపులపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం



- నీటి వాటాల విషయంలో గత ప్రభుత్వ తప్పిదాలను ఆధారాలతో బయటపెడతాం
- ఏపీకి 512 టీఎంసీలు.. తెలంగాణకు 299 టీఎంసీలకు కేసీఆర్ అంగీకారం
- పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా ప్రాజెక్టులకు బీఆర్ఎస్ నేతల మద్దతు
- కేసీఆర్, జగన్ హయాంలోనే పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రారంభం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలది అసత్య ప్రచారమంటూ సీఎం రేవంత్ ఫైర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్ర నీటి హక్కులను కాలరాసింది కేసీఆర్, హరీష్‌రావేనని ఆరోపించారు. నదీ జలాల అంశంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని, ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు విషయంలోనూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. త్వరలోనే అన్ని ఆధారాలతో బీఆర్ఎస్ నేతల ప్రచారాన్ని తిప్పికొడతామని స్పష్టం చేశారు. జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం ముగిసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో జరిగిన నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులు,

2లో..

మోదీతో నేపాల్ ప్రధాని

బాలేన్ షా భేటీ

- బాలేన్ షా విజన్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు
- రూ. 24 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటన

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్, నేపాల్ ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశానికి పలు కీలక వరాలు ప్రకటించారు. ముఖ్యంగా నేపాల్ యువతను సాంకేతికంగా, విద్యాపరంగా బలోపేతం చేసేందుకు అక్కడ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్‌షోర్ క్యాంపస్‌తో పాటు స్టార్టప్ ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్ హబ్ లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రకటించారు.



వికసిత్ భారత్-సమున్నత్ నేపాల్ లక్ష్యంగా అడుగులు

నేపాల్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ద్వైపాక్షిక పర్యటనపై ఇండియాకు వచ్చిన బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "నేపాల్ యువతలో అపారమైన ప్రతిభ, శక్తి, పెద్ద కలలు ఉన్నాయి.

2లో..

కృష్ణా నీటిని

ఏపీ తరలించుకుపోతోంది

- రాజమండ్రిలో కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు!

- సీఎం చేతగానితనంతోనే ఏపీకి కృష్ణా జలాల తరలింపు
- విభజన చట్టం, అపెక్స్ కౌన్సిల్ నిబంధనల ప్రకారమే నీటి పంపకాలు జరగాలి
- రెండు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలి
- కేంద్రంలో బీజేపీతో పాత్తు ఉందని తెలంగాణ నీటి ప్రయోజనాలను దెబ్బతీయొద్దు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి చేతగానితనం, నిస్సహాయ వైఖరి కారణంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను తరలించుకుపోతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. కృష్ణా నదీ జలాల విషయంలో అనుమతులు లేకున్నా ఏపీ నీటిని తరలించుకుపోతున్నదని ఆరోపించారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ నాయకులను విమర్శించడం కంటే తెలంగాణ ముఖ్యమంత్రి అచేతన స్థితిని రాష్ట్ర ప్రజలు తప్పుపడుతున్నారని వ్యాఖ్యానించారు. రాజమండ్రిలో

2లో..



ప్రతిసారీ లాగౌట్.. లేకుంటే ప్రమాదం

- వాట్సాప్ వెబ్ యూజర్లకు కేంద్ర హోం శాఖ హెచ్చరిక



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో వాట్సాప్ వెబ్ వినియోగించే యూజర్లకు కేంద్ర హోంశాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. సిస్టమ్‌లలో వాట్సాప్ వెబ్ లాగిన్ అయి అలాగే వదిలేయడం వల్ల యూజర్ల ఖాతాలను సైబర్ నేరగాళ్లు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకునే ముప్పు ఉందని స్పష్టం చేసింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని

2లో..

డేటా ఆధారిత నిర్ణయాలే

భవిష్యత్ పాలనకు కీలకం

- ఏఐ సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలన్న సీఎం చంద్రబాబు



- వైద్యం నుంచి వ్యవసాయం వరకు ఏఐ సేవల విస్తరణకు ఆదేశాలు
- ప్రభుత్వ శాఖల పనితీరు, ఆదాయాల పెంపునకు ఆధునిక సాంకేతికత
- ప్రజా సేవలను వేగవంతం చేయాలి.. ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం
- ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- సుపరిపాలనకు ప్రజల్లో ప్రభుత్వ సేవలపై సంతృప్తి అవసరం

అమరావతి (ప్రశ్న న్యూస్) మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలో సమూల మార్పులు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలే అత్యంత కీలకంగా మారనున్నాయని, వైద్యారోగ్యం నుంచి వ్యవసాయం వరకు అన్ని ప్రధాన రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతికత, ఏఐ స్టాక్ సహకారంతో ప్రభుత్వ సేవలను సులభతరం చేయడంతో పాటు శాఖల పనితీరును మెరుగుపరిచి, ప్రభుత్వ ఆదాయాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి

2లో..

మారిటైం ఎకానమీకి ప్రాధాన్యత



- ఏపీలో నాలుగు నూతన పోర్టుల నిర్మాణం

అమరావతి (ప్రశ్న న్యూస్) మారిటైం రంగంలో ఆగ్నేయాసియా దేశాలతో శాశ్వత భాగస్వామ్యాలకు ఏపీ సిద్ధంగా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన ఏషియన్-ఇండియా మారిటైం కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ సముద్ర అనుసంధానం, సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకారానికి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో సాగరమాల, మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 ద్వారా దేశంలో సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. దేశ వాణిజ్యంలో 95 శాతం సరుకు రవాణా సముద్ర మార్గం ద్వారానే జరుగుతున్న నేపథ్యంలో పోర్టులు, నౌకాయాన మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు.

ఏపీలో నాలుగు నూతన పోర్టులు

సుమారు 1,053 కిలోమీటర్ల సముద్ర తీరం ఏపీకి గొప్ప వరమని లోకేష్ అన్నారు. విశాఖపట్నం పోర్టు గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 91.17 మిలియన్ టన్నుల సరుకును నిర్వహించి 10 శాతం వృద్ధి సాధించిందన్నారు.

2లో..

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్ష

- ఫేసియల్ రికగ్నిషన్ ఎంట్రీ, ముగ్గురు మంత్రులకు బాధ్యతలు - నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులకు వార్నింగ్
- సమ్మక్క సారలమ్మ తోరణాలు, సాంస్కృతిక వైభవం - గ్లోబల్ సమిట్‌పై సీఎం కీలక ఆదేశాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 వేదికను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సమ్మక్క సారలమ్మ ఆలయ తోరణాల నమూనాలతో పాటు తెలంగాణ రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకతలను చాటిచెప్పేలా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ సూచించారు. ప్రతినిధులకు ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా ప్రవేశం కల్పించాలని, మెరుగైన ఇంటర్నెట్, ఫుడ్ కోర్టులు, ప్రత్యేక లైజనింగ్ అధికారుల వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.



డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు సమ్మిట్

తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడం,

2లో..

ఢిల్లీ పెద్దలకు

తెలంగాణ ఖజానా

- రేవంత్ రెడ్డి రాహుల్‌గాంధీకి ఏటీఎంలా పనిచేస్తున్నారు
- మహా పాదయాత్రలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లి అక్కడ దేశం పరువు తీస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఆపదలో ఉందని విదేశాల్లో రాహుల్ వ్యాఖ్యానించారన్న ఆయన దేశాభివృద్ధి రాహుల్‌కు పట్టదని ఆయన బాధంతా తన కుటుంబ అభివృద్ధి గురించేనని విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రాహుల్‌గాంధీకి ఏటీఎంలా పనిచేస్తున్నారని అన్నారు. కరీంనగర్లో కేంద్రమంత్రి



2లో..

కొలిక్కిరాని కృష్ణా జలాల పంచాయతీ

- ఏ నిర్ణయం లేకుండానే ముగిసిన కేఆర్ఎంబీ భేటీ!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని జలసౌధ వేదికగా సోమవారం జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. నాగార్జునసాగర్ నుంచి నీటి కేటాయింపులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో నీటి పంపకాల అంశాన్ని పూర్తిస్థాయి బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయించాలని అధికారులు నిర్ణయించారు.

3లో..

కర్రెగుట్టల్లోకి ఇప్పుడే పర్యాటకులకు

అనుమతి లేదు

- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతున్నాయి. సాయుధ పోరాటాన్ని వీడి జనజీవన స్రవంతిలో చేరిన 214 మంది మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5.59 కోట్ల నగదు రివార్డులు అందించింది. తాజాగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో ఈ నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. మరోవైపు మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితో పాటు అజ్ఞాతంలో ఉన్న మరో ఇద్దరు సీనియర్ నేతలు కూడా లొంగిపోవాలని డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



3లో..

తెలంగాణ నీటి హక్కులను కాలరాసింది

కేసీఆర్, హరీష్ రావే

బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలను ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.

హరీష్‌రావుకు రాజకీయ గురువు వైఎస్సారే

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చారని, అప్పట్లో హరీష్‌రావు మంత్రిగా ఉన్నారని సీఎం గుర్తుచేశారు. సిద్దిపేటలో తాను చేసిన ఆరోపణలకు హరీష్‌రావు స్పందిస్తూ.. తాను మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాతే అనుమతులు ఇచ్చారని వివరణ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. 2005 సెప్టెంబర్‌లో జీవో 170 జారీ అయ్యే సమయానికి తాను మంత్రిగా లేనని హరీష్‌రావు చెబుతున్నారని, అయితే అదే ఏడాది మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనే పోతిరెడ్డిపాడుకు నిధులు కేటాయించారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేబినెట్ ఆమోదం పొందిన తర్వాతే బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరుగుతాయని, ఆ సమయంలో హరీష్‌రావుతో పాటు ఐదుగురు బీఆర్ఎస్ నేతలు వైఎస్సార్ మంత్రివర్గంలో ఉన్నారని ఆరోపించారు.ఏపీకి ప్రయోజనం చేకూర్చే పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపును బీఆర్ఎస్ మంత్రులుగా మీరే ఆమోదించారని విమర్శించారు. కనీసం వార్డు మెంబర్ కూడా కాని హరీష్‌రావును వైఎస్సార్ మంత్రిని చేశారని, పోతిరెడ్డిపాడుకు అనుమతులివ్వడం ద్వారా ఆయనకు గురుదక్షిణ చెల్లించుకున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

512 టీఎంసీలకు కేసీఆర్ సంతకం

కృష్ణా జలాల కేటాయింపుల్లోనూ తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని సీఎం ఆరోపించారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో అధిక నదీ పరివాహక ప్రాంతం కలిగిన తెలంగాణకు 575 టీఎంసీలు దక్కాల్సి ఉండగా, 26 జూన్ 2015న కేంద్ర జల్‌శక్తి ఆధ్వర్యంలో జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపులకు కేసీఆర్ అంగీకరించి సంతకాలు చేశారని పేర్కొన్నారు. 2020 జనవరి 29న కూడా ఏపీకి 512 టీఎంసీల కేటాయింపులపై కేసీఆర్ ప్రభుత్వం సంతకాలతో అనుమతించిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గతంలో తీసుకున్న నిర్ణయాలతో తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీశారని, రాష్ట్ర రైతులు, ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించారని విమర్శించారు. 2005లో కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బీఆర్ఎస్ నేత నాయిని నర్సింహారెడ్డి ఉన్నారని, హరీష్‌రావు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీల నీటి తరలింపునకు అనుమతి ఇచ్చారని సీఎం ఆరోపించారు. ఏపీకి నీటిని తరలించుకుపోతుంటే హరీష్‌రావు అడ్డుకోకుండా మద్దతు పలికారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని చెబుతున్న బీఆర్ఎస్ నేతలు, తమ పదేళ్ల పాలనలో ఆ నీటి దోపిడీని ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు.

పల్నాడు వాటర్ గ్రిడ్ బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభం

పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు విషయంలోనూ బీఆర్ఎస్ నేతలు వాస్తవాలను దాచిపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్, జగన్ ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలోనే ఈ ప్రాజెక్టు ప్రారంభమైందని స్పష్టం చేశారు. 2022లో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఏపీ సీఎం జగన్ పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ కింద సుమారు రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేసిందని గుర్తుచేశారు. 2024లోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, అప్పటి సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా ఈ అంశంపై స్పందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పల్నాడు వాటర్ గ్రిడ్ అంశం తమ దృష్టికి వచ్చిందని, వెంటనే కేఆర్ఎంబీకి ఈ విషయాన్ని తెలియజేశామని సీఎం వివరించారు. కృష్ణా జలాల వాటాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేశారని వెల్లడించారు.

నీటి హక్కుల విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలు, ప్రస్తుత ప్రభుత్వ వైఖరిని ప్రజల ముందు ఆధారాలతో వివరిస్తామని, బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని త్వరలోనే ఎండగడతామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఢిల్లీ పెద్దలకు తెలంగాణ ఖజానా

బండి సంజయ్ నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్రలో నితిన్ నబీన్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇండి కూటమి రాద్ధాంతం చేస్తోందని నితిన్ నబీన్ విమర్శించారు. ఎస్ఐఆర్‌పై తాము ఇచ్చిన వివరణకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్న ఆయన తమకు మద్దతు తెలిపేందుకు నేడు భారీ సంఖ్యలో వచ్చిన కరీంనగర్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

రాహుల్ తరచూ ఓట్ చోరీ అని ఆరోపిస్తున్నారని ఆక్షేపించారు. రాహుల్ రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకుంటే తాము గుండెల్లో పెట్టుకున్నామన్నారు. దేశంలో 13 కోట్ల ఓట్లు చోరీ అయ్యాయని రాహుల్ అంటున్నారని, 3 కోట్ల మంది చనిపోయినా వారి ఓట్లు ఇంకా జాబితాలో ఉండాలా? అని ప్రశ్నించారు. 6 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని, వారికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండాలా? అని నిలదీశారు. చొరబాటుదారులకు ఓటు వేసే అవకాశం రాజ్యాంగం కల్పించదని గుర్తు చేశారు.

ప్రస్తుతం మరో అవినీతి పాలన

తెలంగాణలో గత ఎన్నికల్లో ఓ అవినీతి పాలనకు ప్రజలు తెరదించారని, ప్రస్తుతం అంతకుమించిన మరో అవినీతి పాలన సాగుతోందని నితిన్ నబీన్ ధ్వజమెత్తారు. మోదీ త్వరలోనే దిగిపోతారని కొందరు అంటున్నారన్న ఆయన.. వచ్చే ఎన్నికల్లోనూ విజయం బీజేపీదేనని స్పష్టం చేశారు. ఎర్రకోటపై మళ్లీ కాషాయ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ కంటే ముందు ఏ ప్రధాని కూడా దేశ సైనికులతో దీపావళి పండుగ జరుపుకోలేదని గుర్తుచేశారు. విదేశీ టూల్ కిట్ ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీయాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ బిడ్డ పీవీని గౌరవించాలని కాంగ్రెస్ ఎప్పుడూ భావించలేదన్న నితిన్ ఆయనను గౌరవించేపని పని బీజేపీ సర్కారు చేసిందన్నారు.

తెలంగాణలో అవినీతి పాలనను అంతమొందించేందుకు మీరు సిద్ధమా? అని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.తెలంగాణలో బీజేపీ లేదనే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకసారి కరీంనగర్‌కు వచ్చి చూడాలని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్‌కు 90 సీట్లు వస్తాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారన్న ఆయన, మహిళలకు రూ.2500 ఇవ్వనందుకు వస్తాయా? పింఛను రూ.4 వేలకు పెంచనందుకు వస్తాయా? అని ప్రశ్నించారు.

ఎల్నినో వల్ల రైతాంగం కష్టాల్లో ఉంటే పట్టించుకోకుండా సాయం చేయనందుకు కాంగ్రెస్కు 90 సీట్లు వస్తాయా అని బండి సంజయ్ నిలదీశారు. రెండు సార్లు బీఆర్ఎస్కు, ఒకసారి కాంగ్రెస్కు అవకాశం ఇచ్చామని ప్రజలు అనుకుంటున్నారన్న ఆయన ఈసారి బీజేపీకే అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

తెలంగాణలో రామరాజ్యం, మోదీ రాజ్యం

కరీంనగర్ గడ్డపై బీజేపీ కార్యకర్తలు జై శ్రీరామ్ అని గర్జిస్తున్నారని వారిని చూడాలని బండి సంజయ్ విపక్షాలను ఉద్దేశించి మాట్లాడారు. నితిన్ నబీన్ బీజేపీని కొత్త పంథాతో పరుగులెత్తిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో బీజేపీ గెలవాలన్నారు. రామరాజ్యం, మోదీ రాజ్యం రావాలని వ్యాఖ్యానించారు.

తమ శరీరంలో దేశభక్తి అనే రక్తం ప్రవహిస్తోందని బండి సంజయ్ తెలిపారు. ఎస్ఐఆర్‌లో చనిపోయిన వాళ్ల ఓట్లు తొలగించాలా, వద్దా అని ప్రశ్నించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఓటు తొలగించలేదని గుర్తుచేశారు. ఈ దేశ ప్రజలే ప్రధానిని నిర్ణయించాలని అన్నారు. డ్రగ్స్ తీసుకుని యువత చనిపోతున్నారని మోదీ కన్నీరు పెట్టుకున్నారని చెప్పారు.

దేశవ్యాప్తంగా 40 ర్యాలీలు

కరీంనగర్ వైశ్యభవన్ నుంచి టవర్ సర్కిల్, శాస్త్రీరోడ్ మీదుగా కమాన్ రోడ్ వరకు నితిన్ నబీన్ మహాపాదయాత్ర సాగింది. బీజేపీ శ్రేణులతో కలిసి బీజేపీ నేతలు ఉత్సాహంగా పాదయాత్ర చేశారు. ఎస్ఐఆర్‌పై విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ నిర్వహించిన ఈ భారీ ర్యాలీకి బీజేపీ శ్రేణులు తరలివచ్చారు.

ఎస్ఐఆర్‌పై వాస్తవాలు వివరించేందుకే మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తదితర నాయకులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం–అరాచకాన్ని అంతం చేద్దాం పేరిట దేశవ్యాప్తంగా 40 ర్యాలీలు నిర్వహిస్తుండగా కరీంనగర్లో సోమవారం నిర్వహించారు.

మోదీతో నేపాల్ ప్రధాని

బాలేన్ షా భేటీ

వారి కలలను సాకారం చేయడంలో భారత్ పూర్తి సహకారం అందిస్తుంది. ఇందులో భాగంగానే నేపాల్‌లో ఐఐటీ క్యాంపస్, స్టార్టప్ ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. అంతే కాకుండా లా, టెక్నాలజీ రంగాల్లో నేపాల్ విద్యార్థులకు ఇండియాలో స్కాలర్‌షిప్ అవకాశాలను మరింత విస్తరిస్తాం" అని మోదీ వెల్లడించారు. వికసిత్ భారత్–సమున్నత్ నేపాల్ లక్ష్యాలను సంయుక్తంగా సాధించేందుకు ఇరు దేశాలు జారీ చేసిన 'జాయింట్ విజన్ డాక్యుమెంట్'లో ఈ నిర్ణయాలు కీలక పాత్ర పోషించనున్నాయి.

ఆగ్రో-ఇండస్ట్రియల్ పార్క్, క్రికెట్ అభివృద్ధికి సహకారం

విద్య, టెక్నాలజీ రంగాలతో పాటు ఇతర కీలక రంగాల్లోనూ ఇరు దేశాల మధ్య సహకారాన్ని విస్తరించేందుకు ఒప్పందాలు కుదిరాయి. నేపాల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్, వాల్యూ అడిషన్‌ను ప్రోత్సహించేందుకు అక్కడ ఆగ్రో–ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధిలో భారత్ భాగస్వామ్యం కానుంది. ఇరు దేశాల యువ క్రియేటర్లు సినిమాలు, ఆధునిక టెక్నాలజీ ద్వారా తమ ఉమ్మడి వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా రాబోయే 'వేవ్స్' సమ్మిట్‌కు నేపాల్ నుంచి భారీ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించనున్నారు. అలాగే నేపాల్‌లో క్రికెట్ క్రీడ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన, ఆటగాళ్ల శిక్షణకు భారత్ అండగా నిలవనుంది.

నేపాల్‌కు 24 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ

గత ఆగస్టులో నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ వరదల వల్ల జరిగిన ప్రాణనష్టంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కష్టకాలంలో నేపాల్‌కు భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ.. వరద అనంతర పునర్నిర్మాణం, దీర్ఘకాలిక అభివృద్ధి కోసం 24,000 కోట్ల నేపాలీ రూపాయల డెవలప్‌మెంట్ కోఆపరేషన్ ప్యాకేజీని ప్రకటించారు. బాధిత కుటుంబాల జీవితాలను తిరిగి గాడిలో పెట్టడంతో పాటు భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ ప్యాకేజీ ముఖ్య ఉద్దేశమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

బాలేంద్ర షా నాయకత్వంపై ప్రధాని మోదీ ప్రశంసలు

ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానిగా కొద్ది నెలల క్రితం ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించిన బాలేంద్ర షా విజన్ ను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. నేపాల్ ప్రజలు ఆయనకు ఇచ్చిన చారిత్రక తీర్పు ఆ దేశ కొత్త తరం ఆశలు, ఆకాంక్షలకు అద్దం పడుతోందని పేర్కొన్నారు.

డేటా ఆధారిత నిర్ణయాలే భవిష్యత్ పాలనకు కీలకం

ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాలనా వ్యవస్థలో సాంకేతికత వినియోగం, పౌర సేవల వేగవంతం, శాఖల పనితీరు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. పాలనా విభాగాల్లో రెవెన్యూ, లీగల్ ఏఐ స్టాక్ ద్వారా వివిధ అంశాలను విశ్లేషించి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపడుతున్నట్లు సీఎం వివరించారు.

ఏఐతో ప్రభుత్వ సేవల్లో సమూల మార్పులు

భవిష్యత్‌లో డేటా ఆధారిత నిర్ణయాలకు మరింత ప్రాధాన్యత పెరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ సమర్థ పనితీరుకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే పౌర సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా చేరవేసేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానంపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ పాలనా వ్యవస్థలో దాని వినియోగాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం, సంతృప్తి ఏర్పడినప్పుడే నిజమైన సుపరిపాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియలో పర్యవేక్షణ లోపాలు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ శాఖ తన పనితీరును నిరంతరం సమీక్షించుకుంటూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ,ఆర్థిక,పురపాలక,ఇంధన శాఖల ఉన్నతాధికారులతో పాటు ఆర్టీజీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిసారీ లాగౌట్.. లేకుంటే ప్రమాదం

'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' కు చెందిన 'నేషనల్ సైబర్ క్రైమ్ థ్రెట్ అనలిటిక్స్ యూనిట్' ఈ భద్రతా హెచ్చరికను విడుదల చేసింది. ముఖ్యంగా ఆఫీసులు లేదా ఇతరులు సులభంగా యాక్సెస్ చేయగల ఉమ్మడి కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్ సెషన్లు యాక్టివ్‌గా ఉండిపోవడం వల్ల సైబర్ మోసాలకు ఆస్కారం ఏర్పడుతోందని అధికారులు వివరించారు.

పొంచి ఉన్న ముప్పు ఇదే..

చాలామంది యూజర్లు పని ముగిసిన తర్వాత కేవలం బ్రౌజర్ ట్యాబ్‌ను మూసివేస్తుంటారు. అయితే, బ్రౌజర్ ట్యాబ్ క్లోజ్ చేసినంత మాత్రాన వాట్సాప్ వెబ్ సెషన్ లాగౌట్ కాదు. దీంతో అదే సిస్టమ్‌ను ఉపయోగించే మూడో వ్యక్తి మీ ప్రమేయం లేకుండానే మీ వ్యక్తిగత చాటింగ్‌లు చదివే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా మీ ఖాతా ద్వారా ఇతరులకు మెసేజ్‌లు పంపడం, కాంటాక్ట్ వివరాలు మరియు గ్రూప్ చాట్‌లను చూడటం చేయవచ్చు. ఈ యాక్సెస్‌ను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు ఫిషింగ్, ఆర్థిక మోసాలు, సోషల్ ఇంజనీరింగ్ నేరాలకు పాల్పడే ప్రమాదం పొంచి ఉందని సైబర్ విభాగం వెల్లడించింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

తప్పనిసరిగా లాగౌట్: కంప్యూటర్‌లో పని పూర్తయిన ప్రతిసారీ వాట్సాప్ మెనూలోకి వెళ్లి 'లాగౌట్' చేయాలి.ఉమ్మడి సిస్టమ్‌లలో వాడొద్దు: కార్యాలయాల్లోని పీసీలు, సైబర్ కేఫ్‌లు, హోటల్ బిజినెస్ సెంటర్లు, లేదా ఇతరులు ఉపయోగించే పబ్లిక్ కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్ అస్సలు వాడకూడదు.శాశ్వత లాగిన్ వద్దు: సిస్టమ్‌లలో వాట్సాప్‌ను ఎప్పటికీ లాగిన్ చేసి వదిలేయకూడదు.ప్రైవేట్ మోడ్ శాశ్వత పరిష్కారం కాదు: అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే, కేవలం నమ్మకమైన కంప్యూటర్లలో మాత్రమే ఇంకాగ్నిటో లేదా ప్రైవేట్ మోడ్‌ను ఎంచుకోవాలి. అయితే ఇది కేవలం అదనపు జాగ్రత్త మాత్రమే తప్ప పూర్తి పరిష్కారం కాదని గుర్తుంచుకోవాలి.అనుమానాస్పద మెసేజ్‌లపై నిఘా: మీరు పంపని మెసేజ్‌లు ఖాతాలో కనిపించినా, లేదా మీ కాంటాక్ట్‌ల నుంచి వింత సమాధానాలు వచ్చినా ఖాతా భద్రతపై వెంటనే అప్రమత్తం కావాలి.సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు: కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్, బ్రౌజర్, యాంటీవైరస్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి. గుర్తుతెలియని లింకులు, పైరేటెడ్ లేదా క్రాక్డ్ సాఫ్ట్‌వేర్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు.రహస్య సమాచారం వద్దు: సున్నితమైన, ఆర్థికపరమైన లేదా అత్యంత రహస్య సమాచారాన్ని వాట్సాప్‌లో పంచుకోకపోవడం ఉత్తమం.ముఖ్యంగా సున్నితమైన డేటాను నిర్వహించే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు తమ అధికారిక కంప్యూటర్లలో వాట్సాప్ వెబ్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా వ్యక్తిగత గోప్యతతో పాటు భద్రతకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

కృష్ణా నీటిని ఏపీ తరలించుకుపోతోంది

తన స్నేహితురాలి తల్లి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు కవిత వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసుండాలని ఆకాంక్షించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల విషయంలో విభజన చట్టం ప్రకారం, అపెక్స్ కౌన్సిల్ సూచించిన విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు.

సామరస్యపూర్వక నీటి పంపకాలే పరిష్కారం

రాష్ట్ర విభజన సమయంలోనే నిబంధనల ప్రకారం నీటి పంపకాలు జరగాలని నిర్ణయించుకున్నామని కవిత గుర్తుచేశారు. ఆ విధంగా పరస్పర అంగీకారంతో నీటి పంపకాలు జరిగితే ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతాయని అన్నారు. ఈ దిశగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకరించాలని కోరారు. కేంద్రంలో బీజేపీతో పొత్తులో ఉన్నామనే కారణంతో తెలంగాణ నీటి వనరులను కొల్లగొట్టే ప్రయత్నాలు చేస్తే రెండు రాష్ట్రాల మధ్య మరోసారి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. నీటి పంపకాల విషయంలో వివాదాలకు తావులేకుండా సామరస్యపూర్వకంగా వ్యవహరించాలని, విభజన చట్టం నిబంధనలకు అనుగుణంగా తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటా అందేలా చంద్రబాబు సహకరించాలని కవిత విజ్ఞప్తి చేశారు.

మారిటైం ఎకానమీకి ప్రాధాన్యత

రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడల్లో నాలుగు నూతన పోర్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. దుగరాజపట్నంలో రూ.30 వేల కోట్లతో షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదించామని, విశాఖలో పోర్టుల విస్తరణ, లాజిస్టిక్స్, నౌకల మరమ్మతులకు సంబంధించి రూ.7,500 కోట్ల విలువైన ఐదు ఒప్పందాలు కుదిరాయని వెల్లడించారు.

డిజిటల్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు ప్రోత్సాహం

విశాఖపట్నాన్ని అంతర్జాతీయ డిజిటల్ కనెక్టివిటీ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. గిగావాట్ స్థాయి ఏఐ హబ్, డేటా సెంటర్లు, సముద్రగర్భ కేబుల్ వ్యవస్థల ఏర్పాటుకు గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించిందన్నారు. మూడు అంతర్జాతీయ సముద్రగర్భ కేబుళ్లు విశాఖలో ల్యాండ్ కానున్నాయని చెప్పారు. శ్రీసిటీ, తిరుపతిలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని బలోపేతం చేస్తుండగా, తర్లువాడలో సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్ కేంద్రం పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. స్మార్ట్ పోర్టులు, ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో లాజిస్టిక్స్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చనున్నట్లు తెలిపారు.

గ్రీన్ ఎనర్జీకి ఏపీ కేంద్రంగా మారుతుంది

సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌ను వినియోగించుకుని ఏపీని గ్రీన్ ఎనర్జీ రంగంలో సౌదీ అరేబియాగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ ఏటా 70 వేల టన్నుల గ్రీన్ అమ్మోనియాను జపాన్‌కు చెందిన జెరా సంస్థకు ఎగుమతి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. గ్రీన్ ఫ్యూయల్స్, క్లీన్ షిప్పింగ్ రంగాల్లో ఆసియాన్ దేశాలతో భాగస్వామ్యాలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

2028 నాటికి 5 వేల మంది మారిటైం నిపుణులు

పెట్టుబడులతో పాటు ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, 2028 నాటికి 5 వేల మంది మారిటైం నిపుణులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. షిప్ బిల్డింగ్, మెరైన్ ఇంజనీరింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో ఉపాధి అవకాశాల కోసం ఐటీఐలు, ఆంధ్రా యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలను సిద్ధం చేస్తున్నామన్నారు. జువ్వలదిన్నెలో మానవరహిత సముద్ర వ్యవస్థల అభివృద్ధికి సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్‌తో కలిసి పనిచేస్తున్నామని, ఐఐటీ తిరుపతి, ఏయూ భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

నాలుగు కీలక రంగాల్లో సహకారం

సముద్ర అనుసంధానం, స్మార్ట్ పోర్టులు--ఏఐ--ఓషన్ రోబోటిక్స్ వంటి సాంకేతికత, గ్రీన్ ఎనర్జీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఆసియాన్ దేశాలతో కలిసి పనిచేసేందుకు ఏపీ సిద్ధంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందని తెలిపారు. భారత్, ఆగ్నేయాసియా దేశాల మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న సముద్ర సంబంధాలను వ్యాపార, సాంకేతిక భాగస్వామ్యాలుగా మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశాఖపట్నం కేవలం పోర్టు నగరంగానే కాకుండా తూర్పు దేశాలకు భారతదేశ ముఖద్వారంగా ఎదుగుతోందని, ఆసియాన్ ప్రతినిధులు ఏపీకి వచ్చి పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు. బంగాళాఖాతాన్ని భారత్, ఆసియాన్ దేశాలకు ఉమ్మడి అవకాశాల వేదికగా మార్చుకుందామని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్ష

పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్నతాధికారులతో సమావేశమై ఏర్పాట్లు, రోజువారీ కార్యక్రమాలు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ప్రతినిధుల భాగస్వామ్యం, భద్రతా చర్యలపై చర్చించారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో ఈ సదస్సు జరగనుంది. సుమారు 80 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద బహుళ రంగాల ఎక్స్‌పోగా దీనిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమ్మక్క సారలమ్మ తోరణాలతో ప్రత్యేక అలంకరణ

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ వేదిక తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. సమ్మక్క సారలమ్మ ఆలయంతో పాటు సోమశిల ఆలయాల తోరణాల నమూనాలను ప్రదర్శనలో ఉపయోగించాలని ఆదేశించారు. కాకతీయుల కాలం నాటి నిర్మాణ శైలిని ప్రతిబింబించే కళాకృతులు, నిర్మల్ చిత్రాలు, జీఐ గుర్తింపు పొంద

కార్తీక సోమవారం వేళ.. భక్తి పారవశ్యం

- శ్రీశైలంలో లక్షదీపాల వెలుగులు, పుష్కరిణి వద్ద దశవిధ హారతులు

- పోటెత్తిన భక్తజనం.. క్యూలైన్లలో అల్పాహారం, వేడిపాలు.. 13 కౌంటర్లలో లడ్డూ ప్రసాదాలు

- నేడు జ్వాలాతోరణోత్సవం, అన్నప్రసాదానికి రూ.5 లక్షలు, గోసంరక్షణకు రూ.లక్ష విరాళం







శ్రీశైలం (ప్రశ్న న్యూస్) కార్తీక మాసం.. అందులోనూ సోమవారం.. పరమశివుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం హరహర మహాదేవ నామస్మరణతో మార్మోగింది. వేకువజామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మరోవైపు పుష్కరిణి ప్రాంగణంలో లక్షదీపోత్సవం, దశవిధ హారతులు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ దేవస్థానం నిర్వహించిన ఈ విశేష కార్యక్రమాలు శ్రీశైల క్షేత్రానికి ఆధ్యాత్మిక వెలుగులు అద్దాయి.ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్తీక మాస ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, అన్నప్రసాదం, తాగునీరు, లడ్డూ ప్రసాదాల పంపిణీతోపాటు ఇతర సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

దశవిధ హారతులతో దివ్యానుభూతి..

పుష్కరిణి వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన లక్షదీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పుష్కరిణి ప్రాంగణమంతా దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సాయంత్రం 6.30 గంటల నుంచి శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు, పుష్కరిణికి శాస్త్రోక్తంగా దశవిధ హారతులు సమర్పించారు.ఓంకారం, నాగం, త్రిశూలం, నంది, సింహం, సూర్యుడు, చంద్రుడు, కుంభం, నక్షత్రం, కర్పూరం.. ఇలా పది రకాల హారతులు భక్తులకు కనువిందు చేశాయి. ఒక్కో హారతికి ఒక్కో ఆధ్యాత్మిక విశిష్టత ఉందని దేవస్థాన పండితులు వివరించారు. కష్టాల నివారణ, సర్పదోష పరిహారం, ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, మానసిక ప్రశాంతత, సకల శుభాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు..

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సోమవారం తెల్లవారుజామున 3 గంటలకే ఆలయ ద్వారాలు తెరిచి ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. ఉదయం 4.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దర్శనాలు కల్పించారు. ఆలయ శుద్ధి, ప్రదోషకాల పూజల అనంతరం సాయంత్రం 5.30 గంటల నుంచి తిరిగి దర్శనాలు ప్రారంభించారు.

రద్దీ అధికంగా ఉండే శని, ఆది, సోమవారాలతోపాటు పౌర్ణమి రోజుల్లో స్వామివారి స్పర్శదర్శనాన్ని నిలిపివేసి అలంకార దర్శనానికే అవకాశం కల్పించారు. భక్తులందరికీ సంతృప్తికరంగా దర్శనం కల్పించేందుకు దేవస్థానం శాఖాధిపతులు, పర్యవేక్షకులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.

క్యూలైన్లలోనే అల్పాహారం.. వేడిపాలు..

దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల ఇబ్బందులను తగ్గించేందుకు దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కట్టుపొంగలి, పులిహోర, పెరుగన్నం, బిస్కెట్లు, మంచినీటిని నిరంతరం అందిస్తున్నారు. సోమవారం ఉదయం భక్తులకు వేడిపాలు కూడా పంపిణీ చేశారు. అన్నప్రసాద



భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ చేపట్టగా, రాత్రి 7 గంటల నుంచి అల్పాహారం అందించే ఏర్పాట్లు చేశారు. లడ్డూ ప్రసాదాల కోసం 13 కౌంటర్లను ఏర్పాటు చేశారు. మహిళలకు ఒకటి, వృద్ధులకు ఒకటి చొప్పున ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంచారు. కార్తీక దీపారాధన చేసుకునేందుకు ఆలయ ఉత్తర మాడవీధి, గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శివకేశవుల అనుగ్రహం కురిసే కార్తీక పౌర్ణమి

ఒక్క దీపం వెలిగిస్తే చాలు.. అజ్ఞానమనే చీకటిని తొలగించే మహాపర్వదినం! భక్తి, జ్ఞానం, ముక్తికి ప్రతీకగా కార్తీక పౌర్ణమి

(ఆధ్యాత్మిక ప్రత్యేక ప్రతినిధి తోట వెంకట్
"ప్రజాప్రశ్న" ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యూరో)





భారతీయ సనాతన ధర్మ సంప్రదాయంలో ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత, ప్రతి పర్వదినానికి ఒక పరమార్థం, ప్రతి ఆచారం వెనుక ఒక ఆధ్యాత్మిక అంతరార్థం దాగి ఉన్నాయి. అలాంటి పవిత్రమైన పర్వదినాల్లో కార్తీక పౌర్ణమికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసంగా ప్రసిద్ధి చెందిన కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి తిథి భక్తుల పాలిట పరమ పవిత్రమైన రోజుగా భావించబడుతుంది. ఈ రోజున దీపారాధన, ఉపవాసం, నదీస్నానం, జపం, ధ్యానం, దానధర్మాలు చేయడం వల్ల పుణ్యఫలాలు లభిస్తాయని పురాణాలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు తెలియజేస్తున్నాయి.

దీపం వెలిగించడం వెనుక ఉన్న పరమార్థం..

కార్తీక పౌర్ణమి అనగానే ప్రతి ఒక్కరికీ ముందుగా గుర్తుకొచ్చేది దీపారాధన. చీకటిని తొలగించి వెలుగును ప్రసరింపజేసే దీపం కేవలం ఒక ప్రమిదలో వెలిగే జ్యోతి మాత్రమే కాదు. అది మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే దైవిక సంకేతం. దీపంలోని వత్తి జీవాత్మకు, నూనె మనిషిలోని అహంకారానికి, జ్యోతి పరమాత్మ తత్వానికి ప్రతీకలుగా ఆధ్యాత్మికంగా భావిస్తారుకార్తీక పౌర్ణమి రోజున ఇంటి గుమ్మంలో, తులసి కోట వద్ద, దేవాలయాల్లో, పవిత్ర నదుల తీరాల్లో దీపాలు వెలిగించడం విశేష ఫలప్రదమని భక్తుల విశ్వాసం. ఒక్క దీపం వెలిగించినా భగవంతుడిపై సంపూర్ణ విశ్వాసంతో, నిర్మలమైన మనస్సుతో వెలిగించాలని పెద్దలు చెబుతారు. ఎందుకంటే భగవంతుడు ఆడంబరాలను కాకుండా భక్తి భావాన్ని చూస్తాడన్నది సనాతన ధర్మంలోని గొప్ప సందేశం.

త్రిపురాసుర సంహారం.. త్రిపురాంతకుడిగా పరమశివుడు..

కార్తీక పౌర్ణమికి సంబంధించి పురాణాల్లో అత్యంత ప్రసిద్ధమైన ఘట్టం త్రిపురాసుర సంహారం. తారకాసురుని కుమారులైన తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అనే రాక్షసులు బ్రహ్మదేవుని వరాలతో మూడు పురాలను నిర్మించుకొని దేవతలను, మునులను, లోకాలను బాధించారని పురాణ కథనం. వారి ఆగడాలను భరించలేని దేవతలు పరమశివుడిని శరణు వేడగా, సర్వలోక రక్షకుడైన మహాదేవుడు త్రిపురాసురులను సంహరించి ధర్మాన్ని స్థాపించాడుఈ విజయాన్ని పురస్కరించుకొని దేవతలు ఆనందోత్సాహాలతో దీపాలు వెలిగించి ఉత్సవాలు జరిపినట్లు పురాణ సంప్రదాయాలు వివరిస్తాయి. అందుకే కార్తీక పౌర్ణమిని త్రిపురారి పౌర్ణమి, దేవ దీపావళి అని కూడా పిలుస్తారు.ఈ కథలోని అంతరార్థం ఎంతో గొప్పది. మనిషిలోని కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం అనే అరిషడ్వర్గాలను జయించినప్పుడే నిజమైన ఆధ్యాత్మిక విజయం సాధ్యమవుతుంది. త్రిపురాసుర సంహారం మనలోని చెడు ఆలోచనలను నాశనం చేసుకొని ధర్మమార్గంలో నడవాలనే సందేశాన్ని అందిస్తుంది.

శివకేశవుల ఆరాధనకు అత్యంత పవిత్రమైన రోజు..

కార్తీక మాసం శివారాధనకు ఎంత ప్రసిద్ధి చెందిందో విష్ణు ఆరాధనకు కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉంది. శివకేశవులు వేర్వేరు రూపాల్లో దర్శనమిచ్చినా పరమతత్వం ఒక్కటేనని మన పురాణాలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు చాటిచెబుతున్నాయి. కార్తీక పౌర్ణమి రోజున శివాలయాల్లో అభిషేకాలు, రుద్రపారాయణాలు, బిల్వార్చనలు, విష్ణు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహిస్తారుముఖ్యంగా శివలింగానికి జలాభిషేకం చేయడం, బిల్వదళాలు సమర్పించడం, ఓం నమఃశివాయ అనే పంచాక్షరీ మంత్రాన్ని జపించడం భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందిస్తాయి. అదేవిధంగా శ్రీమహావిష్ణువును తులసీదళాలతో పూజించడం, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం విశేషంగా భావిస్తారు.

పవిత్ర నదీస్నానం.. పుణ్యఫలాల ప్రాప్తి..

కార్తీక పౌర్ణమి రోజున తెల్లవారుజామునే నిద్రలేచి పవిత్ర నదుల్లో స్నానం ఆచరించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. గంగా, యమునా, గోదావరి, కృష్ణా, కావేరి వంటి పవిత్ర నదుల తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. నదీస్నానం సాధ్యం కానివారు ఇంటి వద్దనే స్నానం ఆచరించి భగవంతుడిని స్మరించుకోవచ్చునదులను కేవలం జలవనరులుగా కాకుండా జీవనదులుగా, దైవ స్వరూపాలుగా భావించడం భారతీయ సంస్కృతిలోని గొప్పతనం. ప్రకృతిని గౌరవించడం, జలవనరులను కాపాడుకోవడం కూడా ఈ సంప్రదాయం మనకు నేర్పే ముఖ్యమైన పాఠం.

జ్వాలాతోరణం.. పాపవిముక్తికి ప్రతీక..

కార్తీక పౌర్ణమి సందర్భంగా అనేక శివాలయాల్లో జ్వాలాతోరణం నిర్వహించడం విశేషం. ఆలయాల్లో ఎండుగడ్డి లేదా ఇతర సంప్రదాయ పదార్థాలతో తోరణాన్ని ఏర్పాటు చేసి దానికి నిప్పంటిస్తారు. అనంతరం భక్తులు ఆ జ్వాలాతోరణం కిందుగా వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఆచారం పాపవిముక్తికి, ఆయురారోగ్య ఐశ్వర్యాలకు ప్రతీకగా భక్తులు విశ్వసిస్తారుఅగ్ని మనిషిలోని మలినాలను దహించి పవిత్రతను ప్రసాదించే శక్తికి ప్రతీక. జ్వాలాతోరణం ద్వారా చెడు ఆలోచనలను విడిచిపెట్టి సన్మార్గంలో నడవాలనే సంకల్పాన్ని భక్తులు వ్యక్తం చేస్తారు.

దీపదానం.. దానధర్మాల మహత్తర సందేశం..

కార్తీక పౌర్ణమి రోజున దీపదానం, అన్నదానం, వస్త్రదానం, గోదానం వంటి దానధర్మాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, పేదలకు సహాయం చేయడం, నిరుపేదలకు వస్త్రాలు అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిజమైన భగవత్ సేవగా భావించబడతాయి.

కేవలం దేవాలయంలో దీపం వెలిగించడమే కాకుండా మరొకరి జీవితంలో వెలుగులు నింపడం కూడా కార్తీక పౌర్ణమి మనకు అందించే గొప్ప సందేశం. మనిషి సంపాదించిన సంపదలో కొంత భాగాన్ని సమాజ సేవకు వినియోగించినప్పుడే ఆ సంపదకు సార్థకత లభిస్తుంది.

సత్యం, ధర్మం, భక్తి.. కార్తీక పౌర్ణమి ఇచ్చే జీవిత సందేశం..

కార్తీక పౌర్ణమి అనేది కేవలం ఒక పండుగ కాదు. మనిషి తన జీవితాన్ని ఒకసారి పరిశీలించుకునే ఆధ్యాత్మిక సందర్భం. మనలోని ద్వేషాన్ని తొలగించుకొని ప్రేమను పెంచుకోవాలి. అసూయను విడిచిపెట్టి సాటి మనిషి అభివృద్ధిని కోరుకోవాలి. అహంకారాన్ని పక్కనపెట్టి వినయాన్ని అలవర్చుకోవాలి. ధర్మం, దయ, కరుణ, సేవాభావంతో జీవించాలిభగవంతుడి సన్నిధిలో వెలిగించే దీపం మన ఇంటిని మాత్రమే కాదు.. మన హృదయాన్ని కూడా వెలిగించాలి. దేవాలయంలో చేసే పూజ మన ప్రవర్తనలోనూ ప్రతిఫలించాలి. భక్తి అనేది కేవలం నుదుటన పెట్టుకునే విభూతి, కుంకుమలోనో, చేతిలో పట్టుకునే పూజా సామగ్రిలోనో ఉండదు. మన ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో కనిపించాలి.ఓం నమఃశివాయ! ఓం నమో నారాయణాయ! సర్వేజనా సుఖినో భవంతు!

కొలిక్కిరాని కృష్ణా జలాల పంచాయతీ

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ అవసరాల నిమిత్తం 19 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరగా, తెలంగాణ ప్రభుత్వం వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు తమకు 21 టీఎంసీలు అవసరమని ప్రతిపాదించింది. ఇరు రాష్ట్రాలు తమ అవసరాల మేరకు నీటి విడుదలకు పట్టుబట్టడంతో బోర్డు ఎలాంటి నిర్ణయాన్ని ఖరారు చేయలేకపోయింది. ఇదే సమయంలో తెలంగాణ అధికారులు పల్నాడు వాటర్ గ్రిడ్ అంశాన్ని లేవనెత్తగా, ఆ పనులను గ్రామీణ నీటి సరఫరా శాఖ పర్యవేక్షిస్తోందని, తమ వద్ద ఆ వివరాలు లేవని ఏపీ జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేశారు.

తెలంగాణ ఇంజినీర్-ఇన్-చీఫ్ రమేశ్‌బాబు మాట్లాడుతూ..

ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో కేవలం 45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. వచ్చే ఏడాది జూలై వరకు ఈ నీటిని ఎంతో పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఇందులో హైదరాబాద్ నగర తాగునీటి అవసరాల కోసమే జూలై వరకు కనీసం 15 టీఎంసీలు తప్పనిసరిగా అవసరమవుతాయని, మరో 5 టీఎంసీల వరకు ఆవిరయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ క్రమంలో సాగర్ నీటిని కేవలం తాగునీటి అవసరాలు, కుడి, ఎడమ కాల్వల పరిధిలోని అవసరాలకే వినియోగించాలని తాము స్పష్టం చేశామన్నారు. కృష్ణా డెల్టాకు నాగార్జునసాగర్ నుంచి చుక్క నీరు కూడా ఇచ్చే పరిస్థితి లేదని తేల్చిచెప్పినట్లు వెల్లడించారు. హైదరాబాద్ తాగునీటి కోటా పోను మిగిలిన 25 టీఎంసీల వినియోగంపై మాత్రమే చర్చించాలని బోర్డుకు సూచించామన్నారు. ఏపీకి ఇప్పటికే పులిచింతలలో 42 టీఎంసీల నీరు ఉందని, పట్టిసీమ ద్వారా కూడా డెల్టాకు నీరు చేరుతోందని గుర్తుచేశారు.

ఏపీ ఇంజినీర్-ఇన్-చీఫ్ నరసింహమూర్తి మాట్లాడుతూ..

కృష్ణా డెల్టా అవసరాల కోసం నీటిని విడుదల చేయాల్సిందేనని తాము బోర్డు వద్ద గట్టిగా పట్టుబట్టామని తెలిపారు. డెల్టా తాగు, సాగునీటి అవసరాలపై 10 రోజుల క్రితమే కేఆర్ఎంబీకి అధికారికంగా లేఖలు కూడా రాసినట్లు పేర్కొన్నారు. ఇక పల్నాడు వాటర్ గ్రిడ్ అంశంపై ఈ భేటీలో ఎలాంటి చర్చ జరగలేదని ఆయన స్పష్టం చేశారు.ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో, త్వరలోనే నిర్వహించనున్న కేఆర్ఎంబీ పూర్తిస్థాయి బోర్డు సమావేశంలోనే కృష్ణా జలాల తాజా కేటాయింపులపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

కర్రెగుట్టల్లోకి ఇప్పుడే పర్యాటకులకు అనుమతి లేదు

ఆపరేషన్ కగార్ ప్రారంభమైన 2024 జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటివరకు తెలంగాణలో మొత్తం 824 మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి పోలీసుల ఎదుట లొంగిపోయారు.వీరిలో 2024లో 49 మంది, 2025లో 509 మంది, 2026లో ఇప్పటివరకు 266 మంది వనం వీడి జనంలోకి వచ్చారు. లొంగిపోయిన వారిలో తెలంగాణకు చెందినవారు 59 మంది కాగా ఛత్తీస్‌గఢ్ నుంచి 754 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది, మహారాష్ట్ర, ఒడిశా నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. మొత్తం 824 మందిలో అర్హులైన 755 మందికి రూ.22.31 కోట్లకు పైగా నగదు రివార్డులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 659 మందికి రూ.17.68 కోట్లకు పైగా చెల్లించారు. మిగిలిన 96 మందికి ఆధార్, బ్యాంకు అకౌంట్ల వివరాలు అందిన తర్వాత నగదు అందజేయనున్నారు. తాజాగా 214 మందికి రూ.5.59 కోట్ల రివార్డులు పంపిణీ చేశారు.లొంగిపోయిన మావోయిస్టులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు పునరావాస ప్రయోజనాలు కూడా తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది. తెలంగాణకు చెందిన 57 మందికి నిమ్స్ ఆసుపత్రిలో నగదు రహిత వైద్యం పొందేందుకు 'ఆరోగ్య రక్షణ' కార్డులు అందించారు. మరో ఇద్దరికి ఆధార్ కార్డులు జారీ అయిన తర్వాత ఈ కార్డులు ఇవ్వనున్నారు. ఇక తెలంగాణకు చెందిన 59 మందిలో 10 మందికి ఇప్పటికే ఇళ్ల స్థలాలు కేటాయించారు. మిగిలిన 49 మందికి స్థలాల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన 765 మంది మావోయిస్టులకు అదనపు పునరావాస ప్రయోజనాలు అందించే అంశంపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తున్నారు.ఈ ఏడాది మావోయిస్టుల నుంచి, తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల ప్రాంతంలో గుర్తించిన 9 డంపుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 252 తుపాకులు, 359 బీజీఎల్ షెల్స్ లభించాయి. స్వాధీనం చేసుకున్న ఆయుధాల్లో 48 ఏకే-47 రైఫిళ్లు, 37 ఇన్సాస్ రైఫిళ్లు, 37 ఎస్ఎల్ఆర్‌లు, 4 ఎల్ఎంజీలు, 25 .303 రైఫిళ్లు వంటి ఆయుధాలు ఉన్నాయి. ఇక కర్రెగుట్టల ప్రాంతంలో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో వివిధ రకాల మందుపాతరలు ఏర్పాటు చేసినట్లు అనుమానిస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యంగా ప్రెషర్ మైన్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో స్పష్టమైన సమాచారం లేదని పేర్కొన్నారు. మావోయిస్టులను విచారించడం ద్వారా 9 ఆయుధ డంపులను గుర్తించినట్లు వివరించారు.కర్రెగుట్టల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నప్పటికీ మందుపాతరల ముప్పు ఉన్నందున ప్రస్తుతానికి పర్యాటకులను అనుమతించడం సాధ్యం కాదని డీజీపీ సీవీ ఆనంద్ తేల్చి చెప్పారు. మైన్స్‌ను పూర్తిగా తొలగించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టిన తర్వాతే పర్యాటకులకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. మరోవైపు తెలంగాణకు చెందిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి (పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యుడు)తో పాటు మరో ఇద్దరు సీనియర్ మావోయిస్టు నేతలు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ తెలిపారు. వారు కూడా సాయుధ పోరాటాన్ని విరమించి జనజీవన స్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధానం కింద వారికి అందాల్సిన ప్రయోజనాలన్నీ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే

- ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ శిల్పా రవి ధ్వజం



నంద్యాల, నవంబరు 23: నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో అధికార టీడీపీ ఎన్ని కుట్రలు, దౌర్జన్యాలకు పాల్పడినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే నిలిచారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అభ్యర్థుల ఉపసంహరణకు ఒత్తిళ్లు, పోలింగ్ రోజు రిగ్గింగ్, కౌంటింగ్‌లో అవకతవకలు జరిగాయని విమర్శించారు. 27 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించిందని, తమ కౌన్సిలర్లు ధైర్యంగా ఎన్నికలకు హాజరయ్యారని పేర్కొన్నారు.వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయడం, ప్రత్యేక జీవోలు జారీ చేయడం, ఎక్స్ అఫీషియో ఓట్ల వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీకి సొంత సభ్యులపై నమ్మకం లేకనే వారిని సీట్ల క్రమంలో కాకుండా పక్కపక్కన కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. రీకౌంటింగ్‌కు పదేపదే అవకాశం ఇవ్వడంపై మున్సిపల్ కమిషనర్ తీరును విమర్శించారు.పంచాయతీ ఎన్నికల్లోనూ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. బొమ్మవరం గ్రామంలో రైతు గడ్డివాము దహనం, బిల్లలాపురంలో మంచినీటి పైప్‌లైన్ల ధ్వంసం ఘటనలను ప్రస్తావిస్తూ రాజకీయ కక్షలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని శిల్పా రవి మండిపడ్డారు

చిట్వేలిలో కూటమి అభ్యర్థికి

ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మద్దతు

చిట్వేలి చిట్వేలి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొంతల శివ నాగేశ్వర్ రావుకు మద్దతుగా రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో కూటమి నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టి, ప్రజలను కలుసుకుని అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ, చిట్వేలి గ్రామ పంచాయతీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొంతల శివ నాగేశ్వర్ రావును గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థికి మద్దతుగా నిలవాలని కోరారు. సర్పంచ్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు వేసి బొంతల శివ నాగేశ్వర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామ ప్రజలు ఐక్యంగా మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని కోరారు. శాసనసభ్యులు అరవ శ్రీధర్ పాల్గొనడంతో కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థి విజయానికి కృషి చేశారు.

అజ్ఞాన చీకట్లను తొలగించి జ్ఞానాన్ని అందించే

ఆధ్యాత్మిక భావనకు ప్రతీక కార్తీకదీపం



అహంకారం, అజ్ఞానం, చెడు ఆలోచనలను తొలగించుకుని సత్యం, ధర్మం, దయ, భక్తి మార్గంలో నడవాలని మార్గనిర్దేశం చేసే పవిత్ర పర్వదినమే కార్తీక పౌర్ణమి. త్రిపురాసుర సంహార గాథ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుంది. పరమశివుడి దివ్య విజయం మనిషిలోని అహంకారాన్ని విడిచిపెట్టి ధర్మమార్గాన్ని అవలంబించాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. ఈ పవిత్రమైన రోజున శివకేశవులను స్మరిస్తూ దీపారాధన చేయడం, దానధర్మాలు ఆచరించడంతో ఆధ్యాత్మిక ప్రశాంతతను పొందవచ్చని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కార్తీక పౌర్ణమి సందర్భంగా వెలిగించే ప్రతి దీపం మన జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించి అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని అందించే ఆధ్యాత్మిక భావనకు ప్రతీక. ఈ కార్తీక మాసమంతా శివనామస్మరణతో, విష్ణు ఆరాధనతో, దీపారాధన చేయడం అత్యంత విశిష్టమైనది. త్రిపురాసురులను సంహరించిన పరమేశ్వరుడు త్రిలోకాలకు విముక్తిని ప్రసాదించిన రోజుగా పురాణాల ఆధారంగా తెలుస్తోంది. అందుకే దీనిని త్రిపురారి పౌర్ణమి అని కూడా పిలుస్తారు. మరోవైపు దేవతలు సైతం దీపాలు వెలిగించి ఆనందోత్సవాలు జరుపుకున్న రోజుగా భావిస్తు దేవదీపావళిగా కూడా జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున నదీస్నానం, శివకేశవుల ఆరాధన, దీపదానం, ఉపవాసం, దానధర్మాలు ఆచరించడంతో ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని విశ్వాసం. అసలు కార్తీక పౌర్ణమి జరుపుకోవడం వెనక ఉన్న కారణాలు, త్రిపురాసుర సంహారం పౌరాణిక గాథ, ఈ రోజున దీపాలు వెలిగించడంలోని అంతర్యాన్ని పరిశీలిస్తే, హిందూ ధర్మంలో కార్తీక మాసానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. ఈ మాసమంతా భక్తులు తెల్లవారుజామునే పవిత్ర స్నానాలు ఆచరించి నిత్య దీపారాధన చేసి ఆధ్యాత్మిక చింతనలో లీనమై శివకేశవులను పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇంతటి పవిత్రమైన కార్తీక మాసంలో వచ్చే కార్తీక పౌర్ణమిని అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఈ పర్వదినం వెనుక అనేక పౌరాణిక విశేషాలు ఉన్నాయి.

త్రిపురాసుర సంహారం.

పురాణాల ప్రకారం తారకాసురుడి కుమారులైన తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అనే ముగ్గురు రాక్షసులు బ్రహ్మదేవుడి కోసం ఘోర తపస్సు చేశారు. వారి తపస్సుకు మెచ్చిన బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమని అడిగాడు. అప్పుడు ఆ రాక్షసులు తమకు మూడు ప్రత్యేకమైన నగరాలు కావాలని కోరారు. బంగారం, వెండి, ఇనుముతో నిర్మించిన మూడు నగరాలు ఆకాశంలో సంచరిస్తు ఉండాలని, అవి ఒకే సరళరేఖలోకి వచ్చినప్పుడు ఒకే బాణంతో వాటిని ధ్వంసం చేయగలిగిన వారే తమను సంహరించాలని వరం పొందారు. బ్రహ్మ ఇచ్చిన వరంతో ఆ రాక్షసుల అహంకారానికి హద్దులు లేకుండా పోవడమే కాక ముల్లోకాల్లోని దేవతలు, మునులు, సాధువులను ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించారు. వారి ఆగడాలు భరించలేని దేవతలు పరమశివుడిని ఆశ్రయించటంతో, లోకకల్యాణం కోసం త్రిపురాసురులను సంహరించాలని పరమశివుడు నిర్ణయించుకున్నాడు. త్రిపురాసురులను సంహరించేందుకు దేవతలందరి శక్తిని సమీకరించి ఒక దివ్య రథాన్ని సిద్ధం చేశారు. భూమిని రథంగా, సూర్యచంద్రులను చక్రాలుగా, మేరుపర్వతాన్ని విల్లుగా, ఆదిశేషుడిని విల్లుతాడుగా రూపొందించారని పురాణ గాథ చెబుతుంది. శ్రీమహావిష్ణువు బాణంగా మారగా, అగ్నిదేవుడు ఆ బాణానికి అగ్రభాగమయ్యాడు. బ్రహ్మదేవుడు రథసారథిగా వ్యవహరించాడు. మూడు నగరాలు ఒకే సరళరేఖలోకి వచ్చిన సమయంలో పరమశివుడు ఒకే ఒక్క బాణాన్ని సంధించాడు. ఆ దివ్యాస్త్రంతో మూడు నగరాలు క్షణాల్లో భస్మమయ్యాయి. త్రిపురాసురుల అహంకారం అంతమై దేవతలకు విముక్తి లభించింది. ఈ విధంగా లోకాలను రక్షించిన పరమశివుడిని త్రిపురాంతకుడు, త్రిపురారి అని పిలుస్తారు. ఈ సంహారం కార్తీక పౌర్ణమి రోజుననే జరిగినట్లు పురాణాల కథనం. అందుకే ఈ పర్వదినాన్ని త్రిపురారి పౌర్ణమిగా కూడా పిలుస్తారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అహంకారంపై దైవశక్తి సాధించిన విజయానికి ఈ గాథ ప్రతీకగా నిలుస్తుంది. త్రిపురాసుర సంహారం అనంతరం దేవతలు ఆనందంతో పరమశివుడిని స్తుతిస్తు దీపాలు వెలిగించి ఉత్సవం జరుపుకున్నారని, ఈ నేపథ్యంలో కార్తీక పౌర్ణమిని దేవదీపావళి అని కూడా వ్యవహరిస్తారు. దీపం అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదిస్తుందనే ఆధ్యాత్మిక భావన ఇందులో నిక్షిప్తమై దాగి సత్యం. అందుకే ఈ రోజున ఇళ్లలో, ఆలయాల్లో, నదీతీరాల్లో, తులసి కోటల వద్ద భక్తులు దీపాలు వెలిగించి సందడి చేస్తారు.

కార్తీక పౌర్ణమికి విష్ణుమూర్తితో ఉన్న సంబంధం

కార్తీక మాసం శివకేశవులిద్దరికి అత్యంత ప్రీతికరమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ మాసంలో శివారాధనతో పాటు శ్రీమహావిష్ణువు ఆరాధనకు కూడా విశేష ప్రాధాన్యం ఉంది. పురాణాల ప్రకారం కార్తీక పౌర్ణమికి శ్రీమహావిష్ణువు మత్స్యావతారంతో సంబంధాలు ఉన్నట్లు మన ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. మత్స్యావతారం ద్వారా సృష్టిని రక్షించిన విష్ణుమూర్తిని ఈ పర్వదినాన భక్తులు స్మరించుకుంటారు. అలాగే కార్తీక మాసాన్ని దామోదర మాసంగా కూడా పిలుస్తారు. ఈ మాసంలో శ్రీకృష్ణుడిని దామోదరుడిగా ఆరాధించడం, తులసి సేవ, విష్ణు సహస్రనామ పారాయణం, హరినామ స్మరణకు విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. అందుకే కార్తీక పౌర్ణమి రోజున శివాలయాలతో పాటు విష్ణు ఆలయాల్లోను భక్తుల సందడి కనిపిస్తుంది.

జ్వాలాతోరణం

కార్తీక పౌర్ణమి సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో జ్వాలాతోరణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. రెండు స్తంభాల మధ్య ఎండిన గడ్డి లేదా ఇతర మండే పదార్థాలతో తోరణాన్ని ఏర్పాటు చేసి నిప్పంటిస్తారు. ఆ తర్వాత భక్తులు ఆ జ్వాలాతోరణం కింద నుంచి దాటుతారు. ఈ ఆచారం వెనుక పౌరాణిక, ఆధ్యాత్మిక విశ్వాసాలు ఇమిడి ఉన్నాయి. శివుడి అనుగ్రహంతో పాపాలు, కష్టాలు తొలగి శుభం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

దీపదానం

కార్తీక పౌర్ణమి ప్రత్యేకతల్లో దీపదానం అత్యంత ప్రధానమైనది. ఈ రోజున నదీతీరాల్లో, ఆలయాల్లో, తులసి కోట వద్ద, ఇంటి ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తారు. మట్టి ప్రమిదల్లో నెయ్యి లేదా నువ్వుల నూనె పోసి వత్తులు వేసి దీపాలు వెలిగించడం సంప్రదాయం. కొందరు అరటి దొప్పల్లో ప్రమిదలను ఉంచి నీటిలో వదులుతారు. దీనిని నదీ దీపదానం అంటారు. అలాగే కార్తీక మాస పౌర్ణమినాడు ఎత్తైన ప్రదేశంలో ఆకాశదీపాన్ని వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఏడాదిలోని ప్రతి రోజుకు ప్రతీకగా 365 వత్తుల దీపాన్ని ఆవు నెయ్యితో శివాలయంలో లేదా తులసి కోట వద్ద వెలిగించడం వల్ల విశేష పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. దీపదానం చేయడం వల్ల జీవితంలో చీకట్లు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఉపవాస దీక్షలు

కార్తీక పౌర్ణమి రోజున చాలామంది భక్తులు ఉపవాసం దీక్షను పాటిస్తారు. కొందరు పూర్తిగా నిరాహారంగా ఉంటే, మరికొందరు పండ్లు, పాలు తీసుకుంటు ఉపవాసం చేస్తారు. ఇంకొందరు ఒకపూట మాత్రమే భోజనం చేస్తారు. ఉపవాసంతో పాటు రోజంతా భగవన్నామ స్మరణ, శివపారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, పురాణ పఠనం చేస్తారు. సాయంత్రం దీపారాధన అనంతరం తమ ఆచారం ప్రకారం ఉపవాసాన్ని విరమిస్తారు. భక్తికి ఉపవాసం ఒక్కటే మార్గం కాదు. భగవంతుడిపై విశ్వాసం, మనసులోని పవిత్రత కూడా అంతే ముఖ్యం. కార్తీక పౌర్ణమి సందర్భంగా వెలిగించే ప్రతి దీపం మన జీవితాల్లో జ్ఞానజ్యోతిని నింపాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరియాలని, సకల జనులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ



కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలతో
రవికుమార్ సంతోజు

విద్యుత్ ఫిర్యాదులపై నిర్లక్ష్యం సహించం

- ప్రభుత్వ పథకాలు గడువులోగా పూర్తి చేయాలి



గుంటూరు(ప్రశ్న న్యూస్) విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి అధికారులను ఆదేశించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. గుంటూరు, సీఆర్డీఏ సర్కిళ్ల పనితీరుపై సోమవారం విజయవాడ కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ఫిర్యాదుల పరిష్కారమే ప్రాధాన్యం..

విద్యుత్ సరఫరా నాణ్యత, వినియోగదారుల ఫిర్యాదులు, రెవెన్యూ వసూళ్లు, లైన్ లాస్ తగ్గింపు, విద్యుత్ భద్రత, నిర్వహణ పనులు, సబ్‌స్టేషన్ల పనితీరుపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ చౌర్యంపై ఉక్కుపాదం..

రెవెన్యూ వసూళ్లలో మెరుగైన ఫలితాలు సాధించాలని, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పుల్లారెడ్డి ఆదేశించారు. పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తి, గుంటూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్, సీఆర్డీఏ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సుధాకర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి మేయర్‌గా శ్రీనివాస ప్రసాద్

- డిప్యూటీ మేయర్‌గా పాలడుగు విజయ ఏకగ్రీవం

- కలెక్టర్ వెంకటేశ్వర్ సమక్షంలో పదవీ బాధ్యతలు



తిరుపతి (ప్రశ్న న్యూస్) తిరుపతి నగరపాలక సంస్థలో కొత్త పాలకవర్గం కొలువుదీరింది. మేయర్‌గా ఎం. శ్రీనివాస ప్రసాద్ (జేబీ శ్రీనివాస్), డిప్యూటీ మేయర్‌గా జనసేనకు చెందిన పాలడుగు విజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించగా, అనంతరం సెనేట్ హాల్‌లో డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించి, నూతన ప్రజాప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

66 మంది కార్పొరేటర్ల ప్రమాణం..

ముందుగా మేయర్‌గా ఎన్నికైన ఎం. శ్రీనివాస ప్రసాద్‌తో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అక్షర క్రమంలో 66 మంది కార్పొరేటర్లతో ఒక్కొక్కరిగా ప్రమాణం చేయించారు. స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుడు డాక్టర్ ఎం. వరప్రసాద్ సమక్షంలో కార్యక్రమం జరిగింది.

ప్రముఖుల హాజరు..

కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ, అదనపు కమిషనర్ యు. శారదాదేవి, స్మార్ట్‌సిటీ జీఎం చంద్రమౌళి, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై కార్తీక శోభ

- మల్లన్న సన్నిధిలో బిల్వార్చన.. భక్తి పారవశ్యంలో భవానీ భక్తులు

- ప్రదోష వేళ ఆకాశదీపం.. సహస్ర లింగార్చన.. సహస్ర దీపాలంకరణ

- భక్తుల సేవలో పారదర్శకతకు ఈవో పెద్దపీట.. సిబ్బందికి 18 సూత్రాల మార్గదర్శకాలు

ఇంద్రకీలాద్రి(ప్రశ్న న్యూస్) కార్తీక మాసపు పవిత్రత.. కార్తీక సోమవారం విశిష్టత.. భవానీ దీక్షల ఆధ్యాత్మిక సందడి.. శివనామస్మరణతో ఇంద్రకీలాద్రి భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. సోమవారం తెల్లవారుజాము నుంచే శ్రీ మల్లేశ్వరస్వామి వారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరోవైపు శ్రీ భవానీ మండల దీక్షలు స్వీకరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి మహామండపం ఆరో అంతస్తులో కొలువుదీరిన శ్రీ భవానీ అమ్మవారి సన్నిధిలో దీక్షలు చేపట్టారు.

బిల్వదళాలతో మల్లన్నకు అభిషేకం..

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సాయంత్రం 3 గంటల నుంచి శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు వి. శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనా నాయక్ మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ బిల్వదళాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు.

ప్రదోష వేళ.. ఆధ్యాత్మిక వైభవం..

ప్రదోషకాలంలో శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీపకాంతులు, వేదమంత్రాలు, శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమాల్లో ట్రస్టుబోర్డు సభ్యులు పి. రాఘవరాజు, పద్మావతి ఠాకూర్, ఎం. కళావతి, ఎస్. సరిత తదితరులు పాల్గొన్నారు.భక్తుల సౌకర్యం, భద్రత, పారదర్శకతే ప్రధాన లక్ష్యంగా ఆలయ యంత్రాంగం చర్యలు చేపడుతుండటంతో ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు పరిపాలనా సంస్కరణలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



నేడు చిట్వేలిలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు



చిట్వేలి : గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చిట్వేలి మండల పరిషత్ కార్యాలయంలో నవంబర్ 24న పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చిట్వేలి మండల అభివృద్ధి అధికారి కె. శ్రీనివాసులు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఓటు వేసే అవకాశం కల్పించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 24న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ కేంద్రం పనిచేస్తుందని వెల్లడించారు. గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది నిర్దిష్ట సమయంలో కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికల విధుల కారణంగా సాధారణ పోలింగ్ రోజున ఓటు వేయలేని సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు వచ్చే సిబ్బంది తప్పనిసరిగా ఎన్నికల విధుల ఉత్తర్వుల కాపీ, ఓటరు గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. అవసరమైన పత్రాలతో కేంద్రానికి హాజరై ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు కోరారు

గుంటూరు మేయర్‌గా లక్ష్మి అపర్ణ

- డిప్యూటీ మేయర్‌గా యర్రంశెట్టి రాజేష్ ఏకగ్రీవం
- 76 మంది కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం, నగర అభివృద్ధే లక్ష్యమన్న నూతన మేయర్
- దేశంలోనే అత్యుత్తమ కార్పొరేషన్లలో ఒకటిగా గుంటూరును తీర్చిదిద్దుతా



గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరు నగరపాలక సంస్థలో నూతన పాలకవర్గం కొలువుదీరింది. నగర మేయర్‌గా కోవెలమూడి లక్ష్మి అపర్ణ ప్రమాణ స్వీకారం చేయగా, డిప్యూటీ మేయర్‌గా 64వ వార్డు కార్పొరేటర్ యర్రంశెట్టి రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం అభిమానులు, నాయకులు, కార్యకర్తల సందడితో ఉత్సాహంగా సాగింది. జిల్లా కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ మేయర్‌తో పాటు 76 మంది కార్పొరేటర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

రాజేష్‌కు ఏకగ్రీవ మద్దతు..

ప్రమాణ స్వీకారం అనంతరం డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. 64వ వార్డు కార్పొరేటర్ యర్రంశెట్టి రాజేష్ పేరును 24వ వార్డు కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ ప్రతిపాదించగా, 45వ వార్డు కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, 6వ వార్డు కార్పొరేటర్ ఇర్రి సాయి బలపరిచారు. ఈ పదవికి మరెవరూ పోటీలో లేకపోవడంతో రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి..

ఈ సందర్భంగా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ నూతన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల చేత నేరుగా మేయర్‌గా ఎన్నికైన కోవెలమూడి లక్ష్మి అపర్ణకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. నగర అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుంటూరు అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజలకు అవసరమైన కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు.



ప్రతి ఇంటికీ మౌలిక సదుపాయాలే లక్ష్యం..

నూతన మేయర్ కోవెలమూడి లక్ష్మి అపర్ణ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థకు మేయర్‌గా బాధ్యతలు చేపట్టడం గౌరవంగా, ఆనందంగా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, యువనాయకుడు నారా లోకేశ్, బీజేపీ పెద్దలు, కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నగర ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గుంటూరును దేశంలోని అత్యుత్తమ నగరపాలక సంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. నగరంలోని ప్రతి ఇంటికీ అవసరమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు.

ప్రముఖుల హాజరు..

కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు నజీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మారుతున్న కాలం.. మారిపోతున్న ఆలోచనలు

నేటి తరం వేగంగా మారుతున్న ప్రపంచంలో జీవిస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, క్షణాల్లో ప్రపంచ సమాచారాన్ని తెలుసుకునే అవకాశం, ఎన్నో రంగాల్లో ఎదిగేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయి. గత తరాలతో పోలిస్తే నేటి యువతకు అవకాశాలు ఎక్కువ. అయితే ఆ అవకాశాలను సరైన మార్గంలో వినియోగించుకోవడంలోనే అసలైన సవాలు ఎదురవుతోంది.



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) చదువు పూర్తికాకముందే ఉద్యోగాలపై ఒత్తిడి, చిన్న వయసులోనే ఆర్థికంగా స్థిరపడాలనే ఆలోచన, సోషల్ మీడియాలో ఇతరులతో పోల్చుకునే మనస్తత్వం, తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆశలు యువతను అనేక సందిగ్ధ పరిస్థితుల్లోకి నెడుతున్నాయి. ఈ సమయంలో యువతకు అవసరమైనది కేవలం సలహాలు కాదు.. జీవితాన్ని అర్థం చేసుకునే సరైన మార్గదర్శకత్వం.

స్వేచ్ఛ ఉంది.. బాధ్యత ఎంత? నేటి యువత స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాలనుకుంటోంది. అది మంచి పరిణామమే. కానీ స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుందనే విషయాన్ని గుర్తించాలి. తల్లిదండ్రుల మాట వినడం బానిసత్వం కాదు.. వారి అనుభవాల నుంచి నేర్చుకోవడం. పెద్దలను గౌరవించడం పాతకాలపు ఆలోచన కాదు.. మన సంస్కృతికి ప్రతిబింబం.

ప్రతి విషయంలో ఎదుటివారిని అనుకరించకుండా, తమకు ఏది మంచిదో ఆలోచించి నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి.

సోషల్ మీడియా మాయలో విలువైన సమయం! సోషల్ మీడియా నేటి జీవితంలో ఒక భాగమైంది. అయితే అదే జీవితమైపోకూడదు. ఇతరుల విజయాలు, విలాసవంతమైన జీవితాలు, ఖరీదైన వస్తువులను చూసి తమ జీవితాన్ని తక్కువగా భావించడం సరైన పద్ధతి కాదు. తెరపై కనిపించేది మొత్తం జీవితం కాదు. ప్రతి ఒక్కరి వెనుక ఎన్నో కష్టాలు, ప్రయత్నాలు, వైఫల్యాలు ఉంటాయి.అనవసరమైన పోలికలకు దూరంగా ఉంటూ, ఫోన్‌ను జ్ఞానం సంపాదించడానికి, నైపుణ్యాలు పెంచుకోవడానికి ఉపయోగించుకోవాలి. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ పరిచయాలు, తప్పుడు ప్రచారాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

ఓటమి అంతం కాదు.. విజయానికి తొలి మెట్టు! చిన్న వైఫల్యానికే కుంగిపోవడం, పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే నిరాశ చెందడం, ఉద్యోగం రాకపోతే జీవితమే ముగిసిపోయిందని భావించడం ప్రమాదకరమైన ఆలోచనలు. జీవితంలో విజయం ఒక్క రోజులో రాదు. కష్టపడే తత్వం, ఓర్పు, క్రమశిక్షణ, నిరంతర ప్రయత్నం ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చు. ఇతరులతో పోటీపడటం కంటే నిన్నటి మనకంటే ఈరోజు మెరుగ్గా ఉండేందుకు ప్రయత్నించాలి. అవసరమైనప్పుడు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, నమ్మకమైన వ్యక్తుల సహాయం తీసుకోవాలి.

తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమే! యువతకు మార్గదర్శకత్వం అందించాల్సిన బాధ్యత కుటుంబాలపైనా ఉంది. పిల్లలపై తమ ఆశయాలను బలవంతంగా రుద్దకుండా, వారి అభిరుచులను అర్థం చేసుకోవాలి. వారి సమస్యలను ఓపికగా వినాలి. తప్పులు చేసినప్పుడు తిట్టడం కంటే వాటి నుంచి ఎలా బయటపడాలో నేర్పించాలి.పిల్లలకు ఖరీదైన వస్తువులు అందించడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు. మంచి విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమాజం పట్ల బాధ్యతను నేర్పించడం కూడా అంతే ముఖ్యం.

యువత గుర్తుంచుకోవాల్సిన జీవిత పాఠాలు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. కష్టపడకుండా విజయం సాధించాలనే ఆలోచనను విడిచిపెట్టాలి. చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండాలి. డబ్బు విలువ తెలుసుకొని పొదుపు అలవాటు చేసుకోవాలి. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించాలి. స్నేహాలు చేసేటప్పుడు వ్యక్తిత్వాన్ని, నమ్మకాన్ని పరిశీలించాలి. మహిళలను గౌరవించడం, సమానత్వాన్ని పాటించడం నేర్చుకోవాలి. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లు పెంచుకోవాలి, తప్పు జరిగితే అంగీకరించి సరిదిద్దుకునే ధైర్యం కలిగి ఉండాలి.

యువత మారితేనే సమాజం మారుతుంది! దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని చెప్పడం మాటలకే పరిమితం కాకూడదు. యువతలో నైపుణ్యాలు, ఆలోచనా శక్తి, సామాజిక స్పృహ, మానవతా విలువలు పెంపొందించేందుకు కుటుంబాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, సమాజం సమష్టిగా కృషి చేయాలి. నేటి తరానికి ఆంక్షలు విధించడం కంటే సరైన దిశ చూపించడం ముఖ్యం. తప్పులు చేయకుండా ఆపడం కంటే తప్పుల నుంచి పాఠాలు నేర్చుకునేలా చేయడం అవసరం. సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మానవ సంబంధాలను కాపాడుకోవాలి.

చివరిగా ఒక్క మాట.. యువతకు మంచి భవిష్యత్తు కావాలంటే కేవలం ఉన్నత చదువులు, మంచి ఉద్యోగాలు ఉంటే సరిపోదు. మంచి ఆలోచనలు, మంచి నడవడిక, కుటుంబ విలువలు, సమాజం పట్ల బాధ్యత కూడా ఉండాలి. చేతిలో ఉన్న ఫోన్ ప్రపంచాన్ని చూపించవచ్చు.. కానీ జీవితానికి దారి చూపించేది మన ఆలోచన, అనుభవం, క్రమశిక్షణ మాత్రమే.తరానికి తగిన సాంకేతికత ఉండాలి.. జీవితానికి తగిన సంస్కారం ఉండాలి. అప్పుడే అభివృద్ధి చెందిన యువతతో పాటు ఆదర్శవంతమైన సమాజం నిర్మాణమవుతుంది.

గోసాయిగూడలో భూ సర్వేలో పాల్గొన్న మార్కెట్ కమిటీ డైరెక్టర్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు గోసాయిగూడ గ్రామంలో నిర్వహించిన భూ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. పూడూరు, కిష్టాపూర్ డివిజన్ 298 పరిధిలో ఈ సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ భూ సర్వేయర్‌తో పాటు రేగు మహేష్, సదానంద్ మరియు పలువురు ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పాల్గొని భూ సర్వే ప్రక్రియను చేపట్టారు. భూములకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తూ సర్వే నిర్వహించారు.గ్రామంలో భూ సంబంధిత అంశాలపై స్పష్టత తీసుకురావడంలో భాగంగా ఈ సర్వే చేపట్టినట్లు తెలిపారు.

సాకేత్ ప్రణామమ్‌లో ఘనంగా ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెల్లి సాకేత్ ప్రణామమ్ సొసైటీ ప్రాంగణంలో ఓజస్వి హోలిస్టిక్ హెల్త్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్లు రామకృష్ణ రాజు, శ్రీరంగారావు ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సాకేత్ ప్రణామమ్ నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ ఆరోగ్య సేవలను వినియోగించుకున్నారు. 41 మంది నివాసితులు సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోగా, 30 మంది సౌకర్యార్థం శిబిరం ప్రాంగణంలోనే రక్త నమూనాలను సేకరించి రక్త పరీక్షలు నిర్వహించారు. 35 మంది కీళ్ల నొప్పులు, ఇతర శారీరక సమస్యలకు ఫిజియోథెరపిస్ట్ సలహాలు, సూచనలు పొందగా, 100 మంది నివాసితులు ప్రత్యేకంగా నిర్వహించిన చైర్ యోగా, ధ్యాన శిక్షణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓజస్వి హోలిస్టిక్ హెల్త్ వ్యవస్థాపకురాలు, సీఈఓ డాక్టర్ పద్మజ నందిగామ నేతృత్వంలో సాగిన ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ సమంత సూర్యదేవర, డాక్టర్ ఎల్. సాయి కుమార్, ఫిజియోథెరపిస్ట్ సరీన్, యోగా, మెడిటేషన్ నిపుణురాలు శ్రీప్రా చెంజి నివాసితులకు సేవలందించారు. వీరికి ఓజస్వి వైద్య సిబ్బంది దీపక్ బొడ్డపాటి, శిరీష చిర్ల బృందం సహకారం అందించింది. అవసరం అయితే అతి తక్కువ ధరలకే ఇంటి వద్దకే వ్యక్తిగత వైద్య సేవలను అందించడంలో ఓజస్వి హోలిస్టిక్ హెల్త్ ప్రత్యేకత కలిగి ఉందని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఓజస్విహోలిస్టిక్ హెల్త్.కామ్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని లేదా 9666020600 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రణామమ్ ప్రతినిధులు వరప్రసాదరావు, శేషసాయి సమర్థవంతంగా నిర్వహించగా, నివాసితులు రామ్మూర్తి నాయుడు, చంద్రకాంతారావు, నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

సర్వ మతాల సారాంశం ఒక్కటే మానవత్వమే అన్ని మతాల లక్ష్యం

- ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని పాటిస్తూ పరస్పర గౌరవం, సహనంతో మెలగాలి
- రెండు లక్షల రూపాయల సొంత నిధులతో రుద్రారం ఎలీమో ప్రార్థన మందిరంలో నూతన బోర్‌వెల్ ఏర్పాటు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు (ప్రశ్న న్యూస్) సర్వ మతాల సారాంశం ఒక్కటేనని, మానవత్వం, ప్రేమ, సేవాభావం, సోదరభావమే అన్ని మతాలు బోధించే ప్రధాన సూత్రాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ మత విశ్వాసాలను గౌరవిస్తూ, ఇతర మతాల పట్ల కూడా ఆదరణ, సహనం కలిగి ఉండాలని ఆయన సూచించారు. సమాజంలో మత సామరస్యం, ఐక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గ్రామంలో ఉన్న ఎలీమో ప్రార్థన మందిరం (చర్చి)లో రెండు లక్షల రూపాయల తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన బోర్‌వెల్‌ను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరికీ కులమతాలకు అతీతంగా సమాన గౌరవం, హక్కులు ఉంటాయని అన్నారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని, పరస్పర సహకారం, సోదరభావంతో కలిసిమెలిసి జీవించినప్పుడే సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో అన్ని మతాల పండుగలు, ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం తనకు అత్యంత ఇష్టమని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కూడా తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రార్థన మందిరానికి వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక కౌన్సిలర్ పాండు, సీనియర్ నాయకులు శ్రీకాంత్, స్థానిక కౌన్సిలర్లు వెంకటేష్, రాజు, మాజీ ఎంపిటిసి రాజు, మాజీ సర్పంచ్ వెంకన్న, నాగరాజు, చర్చి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ కాలనీలో మంచినీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

- రూ.5 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభం
- ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు(ప్రశ్న న్యూస్) నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు సోమవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట నూతన పైపులైన్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ దశలవారీగా అవసరమైన పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, షకీల్, కాలనీ ప్రముఖులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి శతజయంతి వేడుకలు

- అన్నారంలో సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్



పటాన్చెరు (ప్రశ్న న్యూస్) అన్నారం గ్రామంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలోని సాయిబాబా ఆశ్రమంలో ఈ వేడుకలను వైభవంగా నిర్వహించారు.ఉత్సవాలను పురస్కరించుకుని ఆశ్రమంలో సత్యసాయి బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. సాయిబాబా అందించిన మానవతా విలువలు, హితబోధనలను స్మరించుకుంటూ సేవా ట్రస్ట్ సభ్యులు పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ శతజయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. సత్యసాయి బాబా చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ వేడుకల్లో రాష్ట్ర బీఆర్ఎస్ (టీఆర్ఎస్) నాయకులు చిమ్మల గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ వెంబడి సంజీవరెడ్డి, నాయకులు కత్తుల రమేష్, రాజశేఖర్, సురభి కుమార్ గౌడ్, వెంకట రామ్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, నరహరితో పాటు సత్యసాయి బాబా సేవా ట్రస్ట్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'మయూఖ' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!



సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాల పట్ల ఆడియన్స్ విపరీతమైన ఆసక్తిని చూపిస్తుంటారు. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకి రిపీట్ ఆడియన్స్ ఉండరని అంటారు. అయితే టేకింగ్ బాగుంటే, ఈ తరహా సినిమాలను మళ్లీ మళ్లీ చూడటానికి కుతూహలాన్ని కనబరుస్తూ ఉంటారు. అలాంటి జోనర్ లో రూపొందిన 'మయూఖ', అక్టోబర్ 9వ తేదీన థియేటర్లకు వచ్చింది. పెద్దగా పబ్లిసిటీ లేకుండా విడుదలైన ఈ సినిమా, ఈ నెల 20వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది.మయూఖ (పాయల్ చెంగప్ప) ఒక ఫ్లాట్ లో రెంట్ కి ఉంటూ, ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తూ ఉంటుంది. ఆ బ్యాంకుకి మేనేజర్ గా వినయ్ ఉంటాడు. హనీ .. అభిరామ్ కూడా మయూఖతో కలిసి పనిచేస్తూ ఉంటారు. ఆ బ్యాంకుకి సెక్యూరిటీగా రవి ఉంటాడు. మయూఖకి ఫైర్ అంటే చాలా భయం. అంతేకాదు తరచూ ఆమెకి ఒక చిత్రమైన కల వస్తుంటుంది. అంతేకాదు తనతో పాటు ఆ రూమ్ లో ఎవరో ఉన్నట్టుగా, రాత్రివేళలో తన ఫ్లాట్ డోర్ ఓపెన్ చేయడానికి ఎవరో ప్రయత్నిస్తున్నట్టుగా అనిపిస్తూ ఉంటుంది. కార్పెంటర్ 'కుమార్' అనే వ్యక్తి, మయూఖ కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతూ ఉంటాడు. తనతో కలిసి కాఫీకి రమ్మంటూ టార్చర్ చేస్తుంటాడు. ఇక బ్యాంకు సెక్యూరిటీ గార్డుగా ఉన్న రవి కూడా మయూఖను పంకరగా చూస్తుంటాడు. ఈ సమస్యలే ఆమెను సతమతం చేస్తుంటే, అభిరామ్ కూడా ఆమెకి తలనొప్పిగా తయారవుతాడు. ఒకసారి మయూఖ ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె ఫ్లాట్ కి వచ్చిన అభిరామ్, ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తాడు. ఆమె అతణ్ణి ఫ్లాట్ లో బంధించి పోలీసులను రప్పిస్తుంది. పోలీసులు వచ్చేలోగా అభిరామ్ చనిపోతాడు. ఇది ఎలా జరిగిందనేది అర్థంకాక మయూఖ అయోమయంలో పడిపోతుంది. అప్పటి నుంచి పోలీస్ ఆఫీసర్ శ్రీధర్ పర్యవేక్షణలో, మిగతా పోలీసులు ఆమె కదలికలను కనిపెడుతూ ఉంటారు. అయితే అభిరామ్ హత్యకి గల కారణాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో, ముసుగులో ఉన్న సైకో కిల్లర్ ను మయూఖ చూస్తుంది. ఆ సైకో కిల్లర్ దగ్గర ఒక చిత్రమైన సెంటు వాసన వస్తుందని శ్రీధర్ కి మయూఖ చెబుతుంది. ఆ సైకో కిల్లర్ ఎవరు? అతని దగ్గర ఒక రకమైన సెంటువాసన రావడానికి కారణం ఏమిటి? అనేదే మిగతా కథ. సాధారణంగా సైకో కిల్లర్ చేసే హత్యలు దాదాపు ఒకే మార్క్ ను కలిగి ఉంటాయి. తన మార్క్ ఏమిటనేది హంతకుడు తెలియజేయడానికే ప్రయత్నిస్తూ ఉంటాడు. అలాంటి ఒక పద్ధతిని ఫాలో అవుతూ వచ్చిన కథనే ఇది. సైకో కిల్లర్ చేసే వరుస హత్యలు .. అతని దగ్గర చిత్రమైన సెంటు వాసన రావడానికి కారణం ఏమై ఉంటుందా అనే ఒక ఆసక్తిని రేకెత్తిస్తూ దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్నాడు.ఫస్టాఫ్ లో దర్శకుడు ఒక బ్యాంకులోని కొంతమంది ఉద్యోగులను కొన్ని పాత్రలుగా పరిచయం చేస్తాడు. ఈ పాత్రలను కలుపుకుంటూనే కథ కదలడం మొదలవుతుంది. విలక్షణమైన స్వభావం కలిగిన ఈ పాత్రల ద్వారానే ఆడియన్స్ ఉత్కంఠను పెంచడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. ఇక సెకండాఫ్ లోని కథ మాత్రం, బ్యాంకు ఉద్యోగులను దాటుకుని బయటికి వెళుతుంది. ఒక కొత్త ప్రపంచంలో ఈ తతంగమంతా జరుగుతుంది. ఒక వైపున మయూఖకి వచ్చే కల .. ఆమెను వెంటాడుతున్న అనుభవాలు, తన చుట్టూ ఉన్న వ్యక్తులపై తనకి గల అనుమానాలు .. పోలీసుల ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలు ఆడియన్స్ లో కుతూహలాన్ని కలిగిస్తూ వెళతాయి. సెకండాఫ్ లో, సైకో కిల్లర్ కి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ తాలూకు సన్నివేశాలు చోటుచేసుకుంటాయి. ఈ రెండింటికీ ముడివేసిన విధానమే ఇక్కడ ప్రధానంగా ఆకర్షించే మంత్రమని చెప్పాలి. అదే డీలాపడిపోయేలా ఉండటమే ఇక్కడ సమస్య. సస్పెన్స్ థ్రిల్లర్ కి సంబంధించిన కథలలో, చుట్టూ ఉన్న పాత్రలపై అనుమానాలు కలిగేలా చేయడం రొటీన్ గా కనిపిస్తూ ఉంటుంది. ఈ సినిమా విషయంలోను అదే పద్ధతిని అనుసరిస్తూ వెళ్లారు. ఇక సెకండాఫ్ ను కిల్లర్ కి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ నిలబెట్టవలసి ఉంటుంది అనుకున్నప్పుడు, సహజత్వానికి దూరంగా ఈ ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. ఒక వ్యక్తిని సైకోగా మార్చే కారణం చాలా బలహీనంగా అనిపిస్తుంది. ప్రీ క్లైమాక్స్ లోని ట్విస్ట్ పెద్దగా ప్రభావం చూపించదు. ప్రధానమైన పాత్రను పోషించిన పాయల్ చెంగప్పతో పాటు, మిగతా పాత్రలలో కనిపించిన వాళ్లంతా యావరేజ్ నటనను కనబరిచారు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. ఎడిటింగ్ విషయానికి వస్తే, సైకో పాత్ర తాలూకు ఫ్లాష్ బ్యాక్ సన్నివేశాలను ట్రిమ్ చేసుకోవచ్చునని అనిపిస్తుంది. రొటీన్ సీన్స్ తో పాటు, అంతగా పట్టుకోని ఫ్లాష్ ఎపిసోడ్ కారణంగా ఈ సినిమా ఓ మాదిరి కంటెంట్ గానే కనిపిస్తుంది.

ఉత్కంఠగొలిపే మార్మిక ప్రయాణం



యువసామ్రాట్ నాగచైతన్య నటిస్తున్న మైథలాజికల్ మిస్టికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. మీనాక్షి చౌదరి కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్.బి నిర్మిస్తున్న ఈచిత్రం డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రమోషన్‌లో భాగంగా ఈ నెల 25న ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఆదివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. నెల్లూరులోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజ్‌లో జరిగే గ్రాండ్ ఈవెంట్‌లో ట్రైలర్‌ను విడుదల చేస్తామని ప్రకటనలో వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ట్రైలర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఎదురుగా కనిపిస్తున్న ప్రమాదాన్ని చేత్తో తాకబోతూ ఇంటెన్స్ లుక్‌తో నాగచైతన్య ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఆయన పక్కనే భయంకరమైనే నిజాన్ని చూస్తున్న ఎక్స్‌ప్రెషన్‌తో జయరామ్, మీనాక్షి చౌదరి కనిపిస్తున్నారు. వారున్న ప్రదేశం ప్రమాదకరమైన చీకటి గుహను తలపిస్తున్నది. సినిమాపై మరింత ఆసక్తిని పెంచేలా ఈ పోస్టర్‌ని డిజైన్ చేశారు. పురాతన కాలాన్ని గుర్తుచేసే వృత్తాకార చిహ్నాలు, మిస్టీరియస్‌గా చుట్టూ రెడ్ స్మోక్ ఈ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎవరికీ తెలియని ఓ కొత్త ప్రపంచాన్ని ఈ సినిమా ఆవిష్కరించబోతున్నదని ఈ పోస్టర్ చెబుతున్నది. స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో కియారా ఖన్నా, సత్య కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రఫుల్ డి.హెరియన్, సంగీతం: అజనీష్ బి.లోకనాథ్, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్.



ప్రేమ, బ్రేకప్ రెండూ కష్టమేనంటున్న

మీనాక్షి చౌదరి

టాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి తనదైన చలాకీ మాటలతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషకర్మ' ప్రమోషన్లలో చురుగ్గా పాల్గొంటున్న ఆమె, తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో యాంకర్... 'ప్రస్తుతం మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా?' అని మీనాక్షిని ప్రశ్నించారు. దీనికి ఆమె ఏమాత్రం తడుముకోకుండా నవ్వుతూ బదులిచ్చారు. "నాకు ఎవరిపైనా ఎలాంటి క్రష్ లేదు.. అసలు నా జీవితమే క్రష్ అయిపోయింది (నలిగిపోయింది)" అంటూ చమత్కరించారు. వరుస ప్రాజెక్టులు, తీరికలేని షూటింగులు, ప్రమోషన్స్ వల్ల వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించలేకపోతున్న విషయాన్ని ఆమె ఈ విధంగా సరదాగా వివరించారు.అలాగే ప్రేమ, రిలేషన్‌షిప్‌లపై అడిగిన మరో ప్రశ్నకు స్పందిస్తూ.. "నాకు తెలియదు కానీ.. ప్రేమలో పడటం, బ్రేకప్ నుంచి బయటపడటం రెండూ కష్టమే" అని మీనాక్షి వ్యాఖ్యానించారు. 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి విజయాలతో మంచి జోరుమీదున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం తన పూర్తి దృష్టిని సినిమాలపైనే పెట్టినట్లు స్పష్టమవుతోంది. కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'వృషకర్మ' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను నవంబర్ 25న నెల్లూరులో ఘనంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది.

'భోగి' నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన సినిమా



'సినిమా ఫస్ట్ కాపీ చూశాక పూర్తి సంతృప్తిగా ఫీలయ్యా. అంత అద్భుతంగా తీశాడు సంపత్‌నంది. డబ్బింగ్ పూర్తి చేశా. తల్లిలాంటి తెలంగాణ శ్లాంగ్‌ని జాగ్రత్తగా మాట్లాడా. టెక్నీషియన్స్ అందరూ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు. అనుపమ, డింపుల్ పాత్రలు విభిన్నంగా ఉంటాయి. దర్శకులు గుణ్ణం గంగరాజు, దేవ కట్టా, సుజీత్‌ల తర్వాత నాలోని కొత్త నటుడ్ని ఇంట్రడ్యూస్ చేసిన దర్శకుడు సంపత్ నంది. తనకు నిజంగా థ్యాంక్స్. 'భోగి' నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన సినిమా' అని హీరో శర్వానంద్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన తెలంగాణ నేపథ్య పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'భోగి'. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలు. సంపత్‌నంది దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ నెల 27న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో శర్వానంద్ మాట్లాడారు. దర్శకుడు సంపత్‌నంది మాట్లాడుతూ 'ఇది సంక్రాంతి ముందొచ్చే 'భోగి' కాదు. చెడును చంపిన తర్వాత వచ్చే 'భోగి'. 1960లో మహారాష్ట్ర సరిహద్దులో ఉండే బొగ్గలగుట్ట అనే గ్రామంలో చాలాకాలంగా ఉన్న బానిసత్వాన్ని, కొన్ని నమ్మకాల్నీ భోగి మంటల్లో వేసి, ఊరికి కొత్త వెలుగునిచ్చిన ఓ వ్యక్తి కథ ఇది. అన్నచెల్లెళ్ల ఎమోషన్సే ఈ సినిమాకు ప్రధానబలం. మూస కమర్షియల్ ఫార్ములాలను పక్కనపెట్టి ఈ సినిమా కోసం కొత్తగా ట్రై చేశాను. శర్వానంద్ కెరీర్‌లోనే బెస్ట్ పర్‌ఫార్మెన్స్‌ని ఇందులో చూస్తారు. నేషనల్ అవార్డ్ స్థాయిలో ఆయన నటన ఉంది. అవార్డు వస్తుందని ఆశిస్తున్నా. టీమ్ అంతా ప్రాణం పెట్టారు. ఆ కష్టాన్నంతా రేపు తెరపై చూస్తారు' అని నమ్మకంగా చెప్పారు. ఇంకా అతిథిగా విచ్చేసిన డోర్నకల్ శాసనసభ్యులు, డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామచంద్రనాయక్‌తోపాటు కథానాయిక డింపుల్ హయాతి, నిర్మాత కె.కె.రాధామోహన్, గేయ రచయిత చంద్రబోస్, సంగీత దర్శకుడు భీమ్స్‌సిసిరోలియో తదితర చిత్రబృందమంతా మాట్లాడారు.

తెలుగు, తమిళంలో నటన కంటే శరీర భాగాలకే

ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు: తాప్సీ



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను ప్రముఖ నటి తాప్సీ పన్ను పంచుకున్నారు. తాను తమిళం, తెలుగు సినిమాల్లో పనిచేసిన రోజుల్లో కెమెరా ముందు శరీర భాగాలు మరింత ప్రముఖంగా కనిపించేందుకు దర్శకులు హీరోయిన్లను ప్యాడెడ్ బ్రాస్ ధరించమని కోరేవారని ఆమె వెల్లడించారు. శుభాంకర్ మిశ్రా యూట్యూబ్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రేక్షకుల ఆసక్తికి అనుగుణంగా, విజువల్ అప్పీల్ పెంచేందుకే నటన కంటే శారీరక సౌందర్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారని ఆమె పేర్కొన్నారు. సినిమా సెట్‌లలో మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉండేదని, అందుకే దర్శకులు ఈ విషయాన్ని నేరుగా హీరోయిన్లకు చెప్పలేకపోయేవారని తాప్సీ వివరించారు. దర్శకుడి నుంచి అసిస్టెంట్ డైరెక్టర్‌కు, అక్కడి నుంచి స్టైలింగ్ లేదా హెయిర్ టీమ్‌లోని మహిళా సిబ్బందికి ఆ సమాచారం వెళ్లి, చివరకు హీరోయిన్ల వద్దకు చేరేదని తెలిపారు. ముఖ్యంగా పాటల చిత్రీకరణ జరుగుతున్న సమయంలో మధ్యలోనే సెట్ నుంచి వెళ్లి కాస్ట్యూమ్ మార్చుకుని రావడం అత్యంత ఇబ్బందికరంగా ఉండేదని తాప్సీ ఆవేదన వ్యక్తం చేశారు. బట్టలు మార్చుకుని తిరిగి సెట్‌లోకి రాగానే, తమ లుక్‌లో తగినంత మార్పు వచ్చిందో లేదో అని అక్కడున్న వారంతా గమనించేవారని ఆమె గుర్తు చేసుకున్నారు. ఒకవేళ తేడా తెలియకపోతే మళ్లీ వెళ్లి మార్చుకోవాలని చెప్పే పరిస్థితులు కూడా ఉండేవని పేర్కొన్నారు. దక్షిణాది సినిమాల్లో బొడ్డుపై ఎక్కువగా దృష్టి పెడితే, హిందీ చిత్రాల్లో క్లీవేజ్‌పై ఫోకస్ పెడతారని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తాప్సీ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లోనూ, సోషల్ మీడియాలోనూ విస్తృతంగా చర్చనీయాంశంగా మారాయి.

హై ఓ థ్రిల్లింగ్ రైడ్



అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన ఎస్ కృష్ణ దర్శకునిగా మారారు. ఆయన స్వీయ దర్శకత్వంలో హరీష్ పెద్దితో కలిసి నిర్మించిన చిత్రం 'హై'. ఇందులో ఎస్.కృష్ణ ఓ ప్రధాన పాత్ర కూడా పోషించారు. అనన్యశర్మ, పల్లవి దొర, కృష్ణకమల్, సాయికృష్ణ, రేవంత్(బుల్లిరాజు) కీలక పాత్రధారులు. ఈ నెల 27న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. దర్శకుడు, నటుడు ఎస్.కృష్ణ మాట్లాడుతూ 'నేను నటుడ్ని కావాలనేది మా నాన్నగారి కల. అందుకే.. నేను డైరెక్ట్ చేస్తున్న సినిమాలోనే నన్ను ఒక పాత్ర చేయమని నా మిత్రుడు అనిల్ రావిపూడి నన్ను బూస్ట్ చేశాడు. నాన్న కల కూడా అదే కాబట్టి చేశాను. ఇందులో నాపాత్ర పేరు గుడివాడ రాయుడు. కంప్లీట్ ఆల్కహాలిక్ క్యారెక్టర్. ఇందులో నటించిన అనన్యశర్మ, సాయికృష్ణ అందరూ లియలిస్టిక్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చారు. టీమ్ అంతా ప్రాణం పెట్టి పనిచేసింది. 'హై' ఓ థ్రిల్లింగ్ రైడ్. తప్పకుండా ఈసినిమా అందరికీ నచ్చుతుంది' అని నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

కామన్‌మెన్ టార్గెట్‌గా 'ఇగో రాజా'



ఆది సాయికుమార్ ప్రధానపాత్ర పోషిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఈగో రాజా'. కోలీవుడ్ నటుడు సతీశ్ కీలక పాత్రధారి. శరణ్య రామచంద్రన్ కథానాయిక. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గురు శరవణన్ దర్శకుడు. జి.సురేశ్ నిర్మాత. సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ప్రమోషన్‌లో భాగంగా ఈసినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అగ్ర హీరో రవితేజ టీజర్‌ని ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. లోన్ యాప్స్.. తద్వారా వచ్చే పర్యవసానాలు, ఆత్మహత్యలు తదితర అంశాల నేపథ్యంలో ఈ కథ సాగుతుందని టీజర్ చెబున్నది. మాస్ లుక్‌లో ఆదిసాయికుమార్, కామెన్ మెన్‌లా సతీశ్ కనిపిస్తున్నారు. శరణ్య రామచంద్రన్ గ్లామర్ ఈ టీజర్‌కు స్పెషల్ ఎట్రాక్షన్.

'భోగి' నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన సినిమా

'సినిమా ఫస్ట్ కాపీ చూశాక పూర్తి సంతృప్తిగా ఫీలయ్యా. అంత అద్భుతంగా తీశాడు సంపత్‌నంది. డబ్బింగ్ పూర్తి చేశా. తల్లిలాంటి తెలంగాణ శ్లాంగ్‌ని జాగ్రత్తగా మాట్లాడా. టెక్నీషియన్స్ అందరూ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు. అనుపమ, డింపుల్ పాత్రలు విభిన్నంగా ఉంటాయి. దర్శకులు గుణ్ణం గంగరాజు, దేవ కట్టా, సుజీత్‌ల తర్వాత నాలోని కొత్త నటుడ్ని ఇంట్రడ్యూస్ చేసిన దర్శకుడు సంపత్ నంది. తనకు నిజంగా థ్యాంక్స్. 'భోగి' నా కెరీర్‌లోనే ప్రత్యేకమైన సినిమా' అని హీరో శర్వానంద్ అన్నారు.ం

ఆయన కథానాయకుడిగా రూపొందిన తెలంగాణ నేపథ్య పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'భోగి'. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలు. సంపత్‌నంది దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ నెల 27న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో శర్వానంద్ మాట్లాడారు.ందర్శకుడు సంపత్‌నంది మాట్లాడుతూ 'ఇది సంక్రాంతి ముందొచ్చే 'భోగి' కాదు. చెడును చంపిన తర్వాత వచ్చే 'భోగి'. 1960లో మహారాష్ట్ర సరిహద్దులో ఉండే బొగ్గలగుట్ట అనే గ్రామంలో చాలాకాలంగా ఉన్న బానిసత్వాన్ని, కొన్ని నమ్మకాల్నీ భోగి మంటల్లో వేసి, ఊరికి కొత్త వెలుగునిచ్చిన ఓ వ్యక్తి కథ ఇది.

గ్రామాల్లో దళారుల దోపిడీ దందా..

- రైతుల వద్ద నుండి తక్కువ ధరకు వడ్లు కొనుగోలు - కొనుగోలు చేసిన వడ్లు ఇతర రాష్ట్రాలకు తరలింపు
- లారీలకు రశీదులు చింపుతున్న ఏఎంసీ సిబ్బంది - దళారుల మాటున.... కమిషన్లు ఎవరి జేబులోకి
- జేబులు నింపుకుంటున్న దళారులు - రైతు సంఘాలలో వెక్కు వెత్తుతున్న విమర్శలు
- ప్రజా సంఘాల్లో వెల్లువెత్తుతున్న విమర్శలు...



మంథని (ప్రశ్న న్యూస్) పెద్దపెల్లి జిల్లా మంథని మండలం చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో దళారులు బ్రోకర్లు ఆడింది ఆట పాడిందే పాటగా... తమ వ్యాపారాన్ని సాఫీగా దోపిడి దందా సాగిస్తున్నారు. వరి కోతలు ప్రారంభమైన అయినప్పటి నుండి దళారులు రైతుల వద్ద నుండి తక్కువ ధరకు పచ్చి వడ్లను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. క్వింటాలుకు రూ .2000 నుండి రూ. 2500 వరకు కొనుగోలు చేసి ధాన్యాన్ని దళాలు బ్రోకర్లు ఇతర రాష్ట్రాలకు దాటిస్తున్నారు. అయితే రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారి వ్యాపారులు ఇలాంటి అక్రమ దోపిడి దందాలకు పాల్పడుతున్నట్టు రైతు సంఘాల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి.కానీ వ్యాపారులు దళారులు మాత్రం రైతుల చెమట చుక్కను సొమ్ము చేసుకుంటూ... లక్షల రూపాయల నుండి కోట్లాది రూపాయల వరకు పదగలెత్తినట్టు కూడా గట్టిగానే స్థానికంగా వినబడుతున్నాయి. రైతులకు పెట్టుబడి పేరుతో.... ధాన్యం నుండి మొదలుకొని పత్తివరకు కొనుగోలు చేస్తూ వ్యాపారం మాటునా దళారి బ్రోకర్ అవతారం ఎత్తుతున్నారు. ఆరుగాలం కష్ట పడ్డా రైతులకు మిగిలింది తమ చెమట చుక్కానని అంటున్నారు. కాగా ఈ దళారులకు మాత్రం ఎఏంసి, పాక్స్ సహకారంతో దళారు బ్రోకర్లు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు కూడా స్థానికంగా రైతులు సంఘం నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే స్వయంగా ఏఏంసి సిబ్బంది మంథని పాత పెట్రోల్ బంక్ వద్ద వచ్చిపోయే ధాన్యం లారీకి రసీదులు ఇస్తున్నట్టు కూడా సమాచారం. దళాలు బ్రోకర్లు కొనుగోలు చేసిన ధాన్యంతో జేబులు నింపుకుంటూన్నారు. అయితే దళారుల మాటున.... కమిషన్లు ఎవరి జేబులోకి వెళుతున్నాయని స్థానికంగా పలు విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. మంథనిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అసలు ఉన్నట్టా? లేనట్టా? ఉండి కూడా రైతులకు వడ్ల ధాన్యంలో తిప్పలు తప్పటలేదు ఇకనైనా మార్కెట్ కమిటీ సిబ్బంది స్పందించి రైతులకు న్యాయం చేయాలని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు మరి రైతుల కష్టాలు తెలిసేది ఎవరికీ మార్కెట్ కమిటీ లో పనిచేస్తున్న కమిటీ సిబ్బంది రైతుల బాధలను అర్థం చేసుకొని వారి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 సన్నాహాలను సమీక్షించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్(ప్రశ్న న్యూస్)మేడ్చల్ జిల్లా హకీంపేటలోని టీజీఎస్ఎస్‌లో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 సన్నాహాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సమీక్షించారు.సోమవారం 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 కోసం జరుగుతున్న సన్నాహాలను సమీక్షించేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి హకీంపేటలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాల (టీజీఎస్ఎస్)ను సందర్శించారు.ఈ పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖేలో ఇండియా హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ (హెచ్ పి డి) డాక్టర్ పి. రఘుపతి రావు, టీజీఎస్ఎస్ ప్రిన్సిపాల్ ఎం. కల్పన క్రీడా అధికారి జి. వినోద్ కుమార్‌లతో సమావేశమై సన్నాహాల పురోగతిని మదింపు చేశారు. క్రీడల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై వారితో చర్చించారు.కొనసాగుతున్న సన్నాహక పనులను వేగవంతం చేయాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, వసతులు మరియు రవాణా/లాజిస్టిక్స్ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026ను సాఫీగా, సమర్థవంతంగా మరియు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమన్నారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ క్రీడా పోటీని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఏలూరు మేయర్‌గా రెడ్డి అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్‌గా పృథ్వి శారద



ఏలూరు(ప్రశ్న న్యూస్) ఏలూరు నగరపాలక సంస్థలో నూతన పాలకవర్గం కొలువుదీరింది. నగర మేయర్‌గా రెడ్డి అప్పలనాయుడు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించగా, డిప్యూటీ మేయర్‌గా పృథ్వి శారద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం రాజకీయ సందడితో సాగింది.
జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. వెట్రిసెల్వి తొలుత మేయర్‌గా రెడ్డి అప్పలనాయుడితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎన్నికల సంఘం నిబంధనల మేరకు డిప్యూటీ మేయర్‌గా పృథ్వి శారద, అక్షర క్రమంలో 62 మంది కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. వివిధ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు, స్వతంత్ర అభ్యర్థులు నూతన కౌన్సిల్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు.

సత్యసాయి బాబా జయంతికి కేరళ సీఎం సతీశన్

- బాబా 101వ జయంతోత్సవాల్లో పాల్గొని తిరుగు ప్రయాణం





పుట్టపర్తి(ప్రశ్న న్యూస్) భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 101వ జయంతోత్సవాలకు పుట్టపర్తి ఆధ్యాత్మిక క్షేత్రం వేదికైంది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి చేరుకున్నారు. ఉదయం 8.18 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి కేరళ ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

జయంతోత్సవాల్లో పాల్గొని తిరుగు ప్రయాణం..

సత్యసాయి బాబా 101వ జయంతోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కేరళ ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం 10.40 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, 10.50 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, ఆర్డీఓ సువర్ణ తదితరులు ఆయనకు వీడ్కోలు పలికారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.. కొత్త కార్పొరేటర్లకు గళ్ళా మాధవి దిశానిర్దేశం

- మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి నగరాభివృద్ధికి సమష్టి కృషి



గుంటూరు(ప్రశ్న న్యూస్) ప్రజలు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ, ప్రజల మన్ననలు పొందేలా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు పనిచేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నగర అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.గుంటూరు నగరపాలక సంస్థ నూతన మేయర్‌గా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, డిప్యూటీ మేయర్‌తో పాటు నూతన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాసరావుపేటలోని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా టీడీపీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని అక్కడి ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తమపై నమ్మకంతో ఆశీర్వదించిన గుంటూరు ప్రజలు, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమికి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు అందించిన విజయాన్ని బాధ్యతగా భావించి మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ గుంటూరు నగరాన్ని ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, నూతన మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, జనసేన, బీజేపీ నాయకులు, ఎన్డీయే కూటమి కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దర్శికి అభివృద్ధి దిశగా కొత్త పాలకవర్గం

- మున్సిపల్ చైర్మన్‌గా దారం సుబ్బారావు బాధ్యతల స్వీకారం
- వైసీపీ విమర్శలకు గొట్టిపాటి లక్ష్మీ ఘాటు కౌంటర్



దర్శి(ప్రశ్న న్యూస్) దర్శి పురపాలక సంఘంలో నూతన పాలకవర్గం కొలువుదీరింది. మున్సిపల్ చైర్మన్‌గా దారం సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా నక్కా చంద్రతో పాటు మరో 28 మంది కౌన్సిలర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేసి అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ.. దారం సుబ్బారావు చైర్మన్‌గా ఎన్నిక కావడం కూటమి ప్రభుత్వ విజయంతో పాటు ప్రజల విజయమని అభివర్ణించారు. దర్శి చరిత్రలో కూటమి పార్టీల మద్దతుతో ఈ ఎన్నిక ప్రత్యేకతను సంతరించుకుందని పేర్కొన్నారు. ప్రజలు అప్పగించిన బాధ్యతలను పాలకవర్గం చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు.

వైసీపీ విమర్శలకు సవాల్..

వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై గొట్టిపాటి లక్ష్మీ ఘాటుగా స్పందించారు. దర్శిలో అభివృద్ధి పనులు కళ్లకు కనిపిస్తున్నాయని, రాజకీయ విమర్శల కంటే ప్రజలకు చేసిన పనులపై చర్చ జరగాలని పేర్కొన్నారు. గత పాలకుల హయాంలో అభివృద్ధి జరగలేదని ఆరోపిస్తూ, తమ ప్రభుత్వం వచ్చాక డిగ్రీ కళాశాల నిర్మాణం, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనుల పునఃప్రారంభం, రైతుబజార్ ఏర్పాటు, తాగునీటి పథకాలు వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చామని వివరించారు.తాను, వైసీపీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ప్రజలకు ఎంతకాలం అందుబాటులో ఉంటున్నారో ప్రజలే గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరు ఎంత సమయం కేటాయిస్తున్నారో తేల్చుకుందామని సవాల్ విసిరారు. గ్రామాల్లో ఏకగ్రీవ ఎన్నికల సందర్భంగా ఘర్షణలు, దాడులపై కూడా ఆమె విమర్శలు చేశారు. అభివృద్ధి ఎజెండాతో ముందుకు సాగడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజావాణి ఆర్జీలను వెంటనే పరిష్కరించాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, హౌజింగ్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 123 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో తాగునీటి సంక్షోభంపై ప్రభుత్వం పారదర్శకత పాటించాలి

- జనవిజ్ఞాన వేదిక డిమాండ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) సైబరాబాద్‌లో ముంచుకొస్తున్న తాగునీటి సంక్షోభంపై ప్రభుత్వం వెంటనే పూర్తి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా నాయకుడు వరప్రసాదరావు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మనం జిల్లా ప్రతినిధితో మాట్లాడుతూ, సింగూరు, మంజీరా రిజర్వాయర్ల నుంచి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతానికి తాగునీటి సరఫరా జరుగుతుందని, అయితే ఆ రిజర్వాయర్లలో ప్రస్తుత నిల్వలు, వాడుకోగలిగే నీటి పరిమాణం గురించి ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంజీరా, సింగూరుకు దిగువన ఉండటం వల్ల ఈ రెండు రిజర్వాయర్లలో నీటి లభ్యత ఒకదానితో ఒకటి ముడిపడి ఉందని ఆయన వివరించారు. సింగూరు రిజర్వాయర్ 2016, 2018 సంవత్సరాల్లో డెడ్ స్టోరేజ్ స్థాయికి పడిపోయిందని, ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి ఏర్పడిందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.2025లో జాతీయ డ్యాం భద్రతా ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) సూచన మేరకు సుమారు 678 మీటర్ల మేర దెబ్బతిన్న రేఖాంశ మట్టి కట్ట మరమ్మతు కోసం సింగూరు రిజర్వాయర్‌ను ఖాళీ చేశారని గుర్తు చేశారు. అయితే ఆ నిర్ణయం తీసుకునే ముందు ఎల్ నినో ప్రభావం, తగ్గిన వర్షపాతం, రిజర్వాయర్ తిరిగి నింపడానికి పట్టే సమయాన్ని ప్రభుత్వం తగినంతగా పరిగణనలోకి తీసుకుందా అని ప్రశ్నించారు. పైగా మరమ్మతు పనులు కూడా గణనీయంగా ఆలస్యమయ్యాయని విమర్శించారు.2026 డిసెంబర్ 15 నుంచి సైబరాబాద్‌లో తాగునీటి పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారుతుందని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ స్వయంగా హెచ్చరిస్తుండగా, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి మాత్రం నీటి కొరత లేదని చెప్పడం ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపాన్ని స్పష్టంగా చూపుతోందని వరప్రసాదరావు అన్నారు.నీటి కొరత లేకపోతే హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎందుకు హెచ్చరిస్తోంది? హెచ్చరిక నిజమైతే మంత్రి ప్రకటనకు అర్థం ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు.వేగంగా పెరుగుతున్న సైబరాబాద్ జనాభా, విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాల అవసరాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే సింగూరు, మంజీరాలో ప్రస్తుత నిల్వలు, వాడుకోగలిగే నీటి పరిమాణం, సైబరాబాద్‌కు జరుగుతున్న వాస్తవ కేటాయింపు, 678 మీటర్ల కట్ట మరమ్మతు పనుల ప్రస్తుత స్థితి, తగ్గిన వర్షపాతం, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, డిసెంబర్ 15 నుంచి నిరంతరాయ సరఫరా కోసం స్పష్టమైన అత్యవసర ప్రణాళిక, రాబోయే వేసవికి శాస్త్రీయ అంచనాను ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.నీటి భద్రత అనేది ప్రకటనలతో కాదు, లెక్కలతో, శాస్త్రీయ అంచనాతో, నమ్మదగిన ప్రణాళికతోనే సాధ్యమవుతుందని, ప్రజలను చీకట్లో ఉంచి నివారించదగిన సంక్షోభం వైపు నెట్టడం తగదని వరప్రసాదరావు స్పష్టం చేశారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై నూతన్‌కల్ గ్రామంలో రైతులకు అవగాహన



మేడ్చల్(ప్రశ్న న్యూస్) ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై నూతన్‌కల్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు.నీటి లభ్యతను బట్టి, భూసారానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలని అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచించారు.ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెదక్ మండలం నూతన్‌కల్ గ్రామంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటలకు బదులుగా వేరుశనగ, నువ్వులు, మినుములు, ఉలవలు, శనగ వంటి తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని నేలలోని పోషకాల లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని వివరించారు.అలాగే పంటల దిగుబడి పెంపులో పశువుల ఎరువు ప్రాధాన్యతను వివరించారు. పశువుల ఎరువు వినియోగం వల్ల నేల భౌతిక, రసాయన లక్షణాలు మెరుగుపడటంతో పాటు, రసాయన ఎరువుల్లోని పోషకాలు మొక్కలకు సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల మార్పిడిని చేపట్టి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం ఏ ఓ మాధవరెడ్డి, ఏ ఈ ఓ నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కాలేజీల విలీనం వెనుక

ఆర్థిక ప్రయోజనాలా.?

- రేవంత్ సర్కారుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- కార్పొరేట్ విద్యాసంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వ నిర్ణయం,

- విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థను పాఠశాల విద్యలో విలీనం చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజకీయ దుమారం రేపుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్‌ను ప్రత్యేక వ్యవస్థగా కాకుండా పాఠశాల విద్యలో భాగంగా కొనసాగించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇంటర్మీడియట్ వ్యవస్థలో మార్పుల వెనుక విద్యార్థుల ప్రయోజనాల కంటే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు లబ్ధి చేకూర్చే ఉద్దేశాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయం ద్వారా అధికారంలో ఉన్నవారికి సంబంధించిన కుటుంబాల విద్యాసంస్థలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉందని విమర్శించారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా.?

ప్రస్తుతం పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం ప్రత్యేక జూనియర్ కళాశాలల్లో చేరుతున్నారు. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 11, 12 తరగతులను పాఠశాల విద్యావ్యవస్థలోకి తీసుకురావాలని భావిస్తోంది. దీనివల్ల ప్రస్తుత జూనియర్ కళాశాలల నిర్వహణ, గుర్తింపు, బోధనా విధానాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ మార్పులు చిన్న, మధ్యస్థాయి ప్రైవేట్ జూనియర్ కళాశాలల మనుగడపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ప్రతిపక్షం ఆందోళన వ్యక్తం చేస్తోంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు మరింత అవకాశం కల్పించే విధంగా ఈ విధానం మారకూడదని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ లక్ష్యం ఏమిటి.?

మరోవైపు పదో తరగతి తర్వాత విద్యార్థులు చదువును మధ్యలోనే మానేయకుండా ఉండటం, ఇంటర్మీడియట్ విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడం, విద్యా వ్యవస్థలో సమన్వయం పెంచడం తమ లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తేలాల్సింది విద్యార్థుల భవిష్యత్తే

విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం తప్పు కాదు. కానీ ఆ మార్పులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయా? పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువు మరింత భారంగా మారుతుందా? ప్రభుత్వ కళాశాలలు బలోపేతం అవుతాయా? కార్పొరేట్ విద్యాసంస్థల ఆధిపత్యం పెరుగుతుందా? అన్న ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.
విద్య అనేది వ్యాపారం కాదు.. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత. రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలకు అతీతంగా విద్యార్థుల ప్రయోజనాలే కేంద్రంగా నిర్ణయాలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

మార్కెట్లో ఏరివేత స్టార్ట్, వలలో పెద్ద సొరచేప

- మార్కెటింగ్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు జంటనగరాల్లో ఉన్న మార్కెట్ లపై "స్పెషల్ డ్రైవ్"నిర్వహిస్తున్నారు.

- అడిషనల్ డెరైక్టర్ టీం లో "3"(మలక్ పేట్,గడ్డి అన్నరం,బోయిన్ పల్లి) మార్కెట్ లో స్పెషల్ డ్రైవ్ లో పాల్గోంటున్న అధికారులు.

- మరో అధికారి టీం లో (జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్) గుడ్డిమల్కపూరం "4"స్పెషల్ డ్రైవ్ ఉన్నట్లు సమాచారం.

- బోయిన్ పల్లి మార్కెట్ లో "తెల్ల చిట్టి"కలకలం. వికారబాద్ రైతు వాంగ్మూలంతో నోటిసులు జారీ చేసిన ఉన్నత శ్రేణి అధికారి.?

- "2"నెలలుగా జల్లెడ పడుతున్న స్పెషల్ డ్రైవ్ అధికారులు - "బి:16/2.షాపు లైసెన్స్ రద్దు"కు కమిటీ సిద్ధం అవుతున్నట్లు సమాచారం?

- గతంలో సదరు కమీషన్ ఏజెంట్ పై పలు ఆరోపణలు ఉన్నాయని ఛైర్మన్ వివరణ



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో రెండు నెలలుగా ఎం జరుగుతుందో అర్థం కావడంలేదు.మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు ఓ ప్రణాళికను సిద్ధం చేసి ఇద్దరి ఉన్నతాధికారులకు అప్పగించారు.ఆ ఇద్దరిలో మొదటి అధికారి అడిషనల్ డైరెక్టర్ రవి కుమార్, రెండవది పద్మ హర్ష జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్.వీరిలో ఏడికి చెందిన టీం లో పవన్, స్వప్నజాన్ వెస్లీ(బోయిన్ పల్లి,మలక్ పేట్, గడ్డిఅన్నారం). జేడిఎం టీం లో హర్షవర్ధన్, సారిక(గుడ్డ మల్కపూరం). అయితే వీరి విధి విధానాలు మార్కెట్ యార్డులో వర్తకులు పై డేగ కన్నుతో విధులు నిర్వహించడం. ఎవరైనా "రైతుల"పట్ల చిన్నచూపు చూడటం, వారిని మోసం చేయడం, తూకంలో,పట్టిల్లో మెలికలు పెట్టడం మరిన్ని విషయాల్లో ఇబ్బందులు సృష్టించడం జరిగితే వేంటనే చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ నేపధ్యంలో ఏడి టీం కిచెందిన అధికారి "జాన్ వెస్లీ"బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో ఈ నెల 6/11/2026 న వికారాబాద్ కు చెందిన రైతును విచారించగా "150"సంచుల కాలిఫ్లవర్ బి:16/2 షాపుకు తరలించడం జరిగిందన్నారు.తెల్ల చిట్టిలు ఇచ్చి మోసాలకు తెర లేపుతున్న వారి భరతం పట్టడానికే యార్డులో "విజిలెన్స్ అధికారులు" తరుచూ తిరుగుతున్నప్పటికి వ్యాపారస్థుల్లో భయం లేకుండా పోయింది.ఇంత బాహాటంగా కమీషన్ ఏజెంట్లు అన్నదాతలకు "తెల్ల చిట్టిలు"ఇవ్వడం నేరమని తెలిసినప్పటికీ వారిలో మార్పు రావడం లేదు.స్పెషల్ డ్రైవ్ లో భాగంగా జాన్ వెస్లీ స్పెషల్ డ్రైవ్ అధికారి ఆ తెల్ల చిట్టి స్వాధీనం చేసుకుని నివేదిక ఉన్నతాధికారులకు అప్పజేప్పారు.

బోయిన్ పల్లి మార్కెట్ లో ఏది నిజం,ఏది అబద్దం:

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ విస్తీర్ణం సుమారు 23 ఎకరాల 21 గుంటలు. అయితే వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు 2001 డిసెంబర్ 20 న మోండ మార్కెట్ నుంచి విడిపోయిన తర్వాత బోయిన్ పల్లి మార్కెట్ గా రూపాంతరం చెందింది.అయితే ఈ మార్కెట్ లో సుమారు:175 షాపులు వ్యాపారస్తులకు"లాటరీ" ద్వారా కేటాయించారు.కానీ అసలు పోయి కొసరు మిగిలింది.అంటే అసలైన దుకాణం యజమానులు స్థానాల్లో నకిలీలు మోపైయ్యారు.విశ్వసనీయ సమాచారం మేరకు అసలు ప్లేస్లో నకిలీలు దందా చేస్తున్నారు.అది కూడా మోసపూరితమైన వ్యాపారం. ఈ మార్కెట్ ఏర్పడినప్పటి నుంచి మధ్య లో సెలెక్షన్ గ్రేడ్ అధికారి పద్మ హర్ష వ్యవసాయ చట్టానికి తూట్లు పొడిచే వారిని వదల కుండా చర్యలు తీసుకునేది అప్పట్లో,అన్నదాతలు సైతం హర్షం వ్యక్తంచేశారు. గడిచిన ఆరేళ్ల తర్వాత మరో అధికారి ఏడి అడిషనల్ డెరైక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి రవి కుమార్ తీసుకుంటున్న చర్యలు పాత రోజులు గుర్తు వస్తున్నాయని మార్కెట్ లో గుసగుసలాడుకుంటున్నారు. ఇదే తంతు కొనసాగుతే భవిష్యత్తులో కమీషన్ ఏజెంట్లు గీసిన గీత దాటరు.ఇక త్వరలో మరిన్ని ఆశ్చర్యపోయే విషయాలను బయటపెట్టే పనిలో స్పెషల్ డ్రైవ్ టీం రెడీగా ఉన్నట్లు సమాచారం.

బోయిన్ పల్లి మార్కెట్ పాలకమండలి చర్యలు ఉండేనా:

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత కొన్ని రోజుల క్రితం రైతు కిచ్చిన"తెల్ల చిట్టి"తో అడ్డంగా బుక్కయ్యాడు ఓ ప్రబుద్ధుడు.అయితే రెండు మాసాలుగా బోయిన్ పల్లి మార్కెట్ లో స్పెషల్ డ్రైవ్ నడుస్తున్న నేపథ్యంలో అధికారులు డేగ కన్నుతో కాచుకొని ఉన్నారు.చిన్న చిటిక వారి దృష్టికి వస్తున్నప్పటికీ పెద్ద తిమింగలాన్ని పట్టుకోవాలనే ఆలోచనతో వేచి ఉన్న అధికారులకు "శ్రీ సాయి వాణి"షాపు అడ్డంగా దొరికిపోయింది. ఈ విషయం పై బోయిన్ పల్లి మార్కెట్ ఉన్నత శ్రేణి అధికారి ఎం.వెంకన్న నోటిసులు జారీ చేసిన విషయం విదితమే.కానీ పాలకమండలి కూడా చర్యలకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం? అసలు విషయం ఏమిటంటే మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు కేటాయించిన దుకాణం పేరు: శ్రీ సాయి వాణి "ఆస్థానంలో"ఎస్ కే ఆర్ పేరుతో ఉండడం, అలాగే రైతుని మోసం చేసిన కమీషన్ ఏజెంట్ లైసెన్స్ రద్దు పై కమిటీలో తీర్మానం చేసే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం ? 1969 వ్యవసాయ



మార్కెటింగ్ చట్టం ప్రకారం "అలాటి"పై చర్యలు ఎందుకు తీసుకోకూడదు అని పాలక మండలిలో చర్చ ఘాటుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.? ఒకవేళ సదరు కమీషన్ ఏజెంట్ గదువులోపు సమాధానం ఇచ్చినప్పటికీ కమిటీ తరపు నుంచి చర్యలు తప్పవు ? ఎందుకంటే గతంలో ఈ షాపు యజమాని పై పలు ఆరోపణలు ఉన్నాయని కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు


NOTICE

పేర్కొన్నారు.

నియమం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:

వ్యవసాయ మార్కెటింగ్ చట్టం ప్రకారం:1966, 1969.స్పెషల్ నియమాలు 65 నుంచి 73.బై-లా :35 ప్రకారం,లైసెన్స్ పొందిన కమీషన్ ఏజెంట్లు కేవలం "4 శాతం"వసూళ్లు చేయాలి కానీ నిర్దేశించిన కమీషన్ కంటే ఎక్కువ వసూళ్లు చేయడం కఠినంగా నిషేధితం.ఒక వేళ రైతుకు కుచ్చు టోపీ పెడితే నిబంధనలకు విరుద్ధంగా అదనపు కమీషన్ వసూలు చేసినందుకు (సెక్షన్:17 లేదా 17-ఏ ఉల్లంఘన) ప్రధానంగా సెక్షన్ 23(4) వర్తిస్తుంది.(ఒకవేళ రుజువైతే 3 నుంచి 6 నెలల జైలు శిక్ష,జరిమానా విధించే అవకాశం ఉందని చట్టంలో పేర్కొన్నారు.)

విశాఖలో డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం

- డ్రగ్స్ కింగ్‌పిన్స్‌పై ఉమ్మడి వేటకు రంగం సిద్ధం



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) విశాఖ నగరాన్ని మత్తు పదార్థాల మహమ్మారి నుంచి విముక్తి చేసేందుకు పోలీస్ యంత్రాంగం మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులు, కింగ్‌పిన్స్ ఆటకట్టించడమే లక్ష్యంగా నగర పోలీసులు, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు ఉమ్మడి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు.నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి, ఐపీఎస్ అధ్యక్షతన సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సింథటిక్, సెమీ సింథటిక్ డ్రగ్స్‌కు సంబంధించిన కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్షించారు. కేవలం డ్రగ్స్ పట్టుకోవడానికే పరిమితం కాకుండా, వాటి సరఫరా నెట్‌వర్క్, ప్రధాన మూలాలు, వెనుక ఉన్న కింగ్‌పిన్స్‌ను గుర్తించి అరెస్టు చేయడంపై ప్రత్యేకంగా చర్చించారు.డ్రగ్స్ ఎక్కడి నుంచి నగరంలోకి వస్తున్నాయి? ఎవరి ద్వారా సరఫరా అవుతున్నాయి? ఈ అక్రమ వ్యాపారం వెనుక ఉన్న కీలక వ్యక్తులెవరు? అనే కోణాల్లో దర్యాప్తును ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఎన్‌సీబీ, నగర పోలీసుల మధ్య సమాచార మార్పిడి పెంచి, సమన్వయంతో దాడులు, దర్యాప్తు చర్యలు చేపట్టేందుకు కార్యాచరణపై చర్చించారు.ఈ సమావేశంలో డీసీపీ-1తో పాటు ఎన్‌సీబీ అధికారులు, సీఐలు, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు నగరపాలక సంస్థలో

కొత్త పాలకవర్గం కొలువుదీరింది

- 62 మంది కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం



ఒంగోలు(ప్రశ్న న్యూస్) ఒంగోలు నగరపాలక సంస్థలో నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. నగరపాలనలో కీలక ఘట్టంగా నిలిచిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 62 మంది కార్పొరేటర్లతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎన్నికలో చావలి చార్వితి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. దీంతో ఆమెను డిప్యూటీ మేయర్‌గా అధికారికంగా ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, కో-ఆప్షన్ సభ్యుల చైర్మన్ రియాజ్, నగరపాలక సంస్థ మేయర్ నల్లమల్లి శ్రీశిల్ప తదితర ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా నగర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించడంతో ఒంగోలు నగర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై నగరవాసుల్లో ఆశలు నెలకొన్నాయి.

విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ

- డిప్యూటీ మేయర్‌గా చెన్నుపాటి కాంతిశ్రీ ఏకగ్రీవం..

- 85 మంది కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించిన కలెక్టర్ లక్ష్మీశ



విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడ నగరపాలక సంస్థలో నూతన పాలకవర్గం కొలువుదీరింది. మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ, డిప్యూటీ మేయర్‌గా 12వ వార్డు టీడీపీ సభ్యురాలు చెన్నుపాటి కాంతిశ్రీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం నగరంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ప్రత్యేక సమావేశం రాజకీయ సందడితో ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేయర్‌తో పాటు 85 మంది వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.(వంగవీటి రాధాకృష్ణ అనే నేను... అంటూ నూతన మేయర్ ప్రమాణ స్వీకారం చేయగా, అనంతరం కార్పొరేటర్లు అక్షర క్రమంలో ప్రమాణం చేశారు. 32వ వార్డు నుంచి ఎన్నికైన టీడీపీ సభ్యురాలు శైలజ సురభి మినహా మిగిలిన వార్డు సభ్యులంతా ఈ కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేసినట్లు అధికారులు తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన పాలన అందించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన ప్రజాప్రతినిధుల బాధ్యతలు ప్రారంభమయ్యాయి.

డిప్యూటీ మేయర్‌గా కాంతిశ్రీ ఏకగ్రీవం..

మేయర్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ల డిప్యూటీ మేయర్ ఎన్నికల నిబంధనలు--2026, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. 12వ వార్డు టీడీపీ సభ్యురాలు చెన్నుపాటి కాంతిశ్రీ పేరును 48వ వార్డు సభ్యుడు ఉమ్మడి వెంకటేశ్వరరావు ప్రతిపాదించగా, 4వ వార్డు సభ్యుడు నందిపాటి దేవానంద్ కుమార్ బలపరిచారు. మరో అభ్యర్థి లేకపోవడంతో కాంతిశ్రీ డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ప్రకటించారు.

హాజరైన ప్రముఖులు..

ఈ కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), శాసనమండలి సభ్యులు వర్ల రామయ్య, ఎం.డి. రుహుల్లా, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎ. రవీంద్రరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నూతన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. నూతన పాలకవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588